ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి


www.janamsakshi.org

గురువారం 25.06.2026 | సంపుటి : 12 సంచిక : 336 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# తుంగభద్ర నీటివాటా తెలంగాణ హక్కు

## నికర వాటా జలాల వినియోగానికి భాగస్వామ్య రాష్ట్రాలతో సమన్వయానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



హైదరాబాద్ జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్ , అంతర్రాష్ట్ర నదీ జలవివాదాలపైన సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష.. హాజరైన మంత్రి ఉత్తమ్ ,ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్,సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్,ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు

- ఆర్డీఎస్ నీటివాటా 15.9 టీఎంసీలు కాగా ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడంలేదు
- జలాల పంపిణీకి కేంద్ర జల సంఘం సారథ్యంలో తుంగభద్ర బోర్డును పటిష్టం చేయాలి
- ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక వల్ల నీటి మళ్ళింపు సాధ్యం కావడం లేదు
- అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- సమావేశానికి హాజరైన మంత్రి ఉత్తమ్ ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):**తుంగభద్ర నుంచి మన రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి.. భాగస్వామ్య రాష్ట్రలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగ భద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్డీఎస్ కింద జోగులాంబ గద్వాల జిల్లాలో దాదాపు 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది.మూడు రాష్ట్రాల భాగ స్వామ్యం ఉన్నందున కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలం గాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్ధ వినియోగానికి కేంద్ర జల సంఘం సారథ్యంలో తుంగ భద్ర బోర్డ్ ను పటిష్టం చేయాలని కోరారు.బుధవారం సాయంత్రం జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్ , అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశం లో పాల్గొన్నారు.ఆర్డీఎస్ ఆనకట్ ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా

మిగతా 2లో..

## 'సర్'పై నిర్లక్ష్యం సహించం

- ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తం కావాలి
- పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

## సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట


హుజూర్‌నగర్ ఉపఎన్నిక సందర్భంగా నమోదైన కేసులు కొట్టివేత

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

- కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి
- నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది
- సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ

వివరాలు 2వ పేజీలో..

## తెలంగాణలో నేటి నుంచి 'సర్'



- రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం
- సర్వం సిద్ధం చేసిన అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):**ఓటర్ల జాబితా సవరించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలో అధికారులు సిద్ధమయ్యారు. సర్ ప్రక్రియలో శుక్రవారం నుంచి జులై 24 వరకు ఇంటింటి గణనకు వచ్చే బీఎల్‌వోలు ఒక కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉంటే అన్ని ఎన్యుమరేషన్ ఫారాలు విడివిడిగా ఇస్తారు. వీటిని ఓటరు విధిగా తన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను జత చేసి పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నెంబర్, ఫోన్ నెంబర్, తల్లిదండ్రుల వివరాలు, వారి ఓటు హక్కు వివరాలను నింపి అందజేయాల్సి ఉంటుంది. లేదా నేరుగా ఎన్నికల సంఘం యాప్‌లో అప్లోడ్ చేయవచ్చు. ఒకవేళ ఇంటి వద్ద లేని పక్షంలో సంబంధిత ఫారం డౌన్ లోడ్ చేసుకోవాలని, జూలై 24 లోగా అప్లోడ్ చేసి ఎక్నాలెడ్జిమెంట్‌ను బీఎల్‌వోలకు

మిగతా 2లో..




## బోగస్ ఓట్లను మాత్రమే తొలగించాలి

- ఒకరికి ఒకే ఓటును అమలు చేయండి
- ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ వినతి

2 లో..

## మళ్లీ కేసీఆరే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం
- జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం
- సత్తుపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ఖమ్మం(జనంసాక్షి):** రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు.

మిగతా 2లో..



## బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట

శరతులతో కూడిన బెయిల్ మంజూరు

**హైదరాబాద్(జనంసాక్షి):** సింగరేణి సంస్థ మరియు దాని యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు ఊరటనిచ్చింది. గతంలో ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన

మిగతా 2లో..

## ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీగడపకూ అభివృద్ధి,సంక్షేమం

- బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే
- ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నా ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- మంత్రులు భట్టి, తుమ్మల



**ఖమ్మం(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు.బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల

మిగతా 2లో..

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!

నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న రామకృష్ణారావు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌జాజు నియమితులయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న ఈయనను తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకొంది. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు ఈ నెలాఖరుకు పదవీ

మిగతా 2లో..





## ఇరాన్ అణు కేంద్రాల్లో మళ్లీ తనిఖీలు

యూఎన్ అణుశక్తి సంస్థ చీఫ్ రఫెల్ మారియానో గ్రోస్సీ కీలక ప్రకటన

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్ అణు కార్యక్రమంపై నెలకొన్న అనిశ్చితికి తెరపడేలా ఐక్యరాజ్య సమితి అణుశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రఫెల్ మారియానో గ్రోస్సీ కీలక ప్రకటన చేశారు. అమెరికా- ఇరాన్ మధ్య ఇటీవల

మిగతా 2లో..

## అమెరికాతో ఒప్పందంలో క్షిపణి కార్యక్రమానికి చోటు లేదు

- భవిష్యత్తులో ఎలాంటి ఒప్పందాల్లోనూ భాగస్వామ్యం కానియబోం
- స్పష్టం చేసిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్
- క్షిపణులే లేకపోతే ఇప్పటికే ఇరాన్‌ను నాశనం చేసేవారని వెల్లడి



**టెహ్రాన్(జనంసాక్షి):**అమెరికాతో కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పం దంలో క్షిపణి కార్యక్రమానికి చోటు లేదన్న క్షిపణులు లేకపోతే అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌ను నాశనం చేసేవని వ్యాఖ్యఅమెరికాతో కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పందం (ఎంఓయూ)లో ఇరాన్ క్షిపణి కార్యక్ర మానికి ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా తమ క్షిపణి సామర్థ్యాలను ఎలాంటి అంతర్జాతీయ ఒప్పందాల్లో భాగం చేయబోమని తేల్చిచెప్పారు. పాకిస్థాన్ పర్యటనలో భాగంగా ఇస్లామాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల స్విట్జర్లాండ్‌లో అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన సాంకేతిక చర్చల అనంతరం ఈ ప్రకటన ప్రాధాన్యం

మిగతా 2లో..

## అణు తనిఖీలకు అంగీకరించకపోతే ఇరాన్‌తో చర్చలు రద్దు చేస్తా

- హర్మూజ్ జలసంధిలో ఎటువంటి సుంకాల్లేవ్
- ఈ విషయమై టెహ్రాన్ మాకు హామీ ఇచ్చింది : ట్రంప్



**వాషింగ్టన్(జనంసాక్షి):**మరోవైపు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తనిఖీలకు ఇరాన్ అనుమతి ఇవ్వకపోతే ఆ దేశంతో జరుగుతున్న చర్చలను వెంటనే రద్దు చేస్తామని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. అణు తనిఖీలకు సంబంధించి ఇరాన్ ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించిందని, అందుకు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికాలోని స్లివేనియా పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్, అణు తనిఖీల అంశంపై ఇరాన్ వైఖరిపై వచ్చిన వార్తలను కొట్టిపారేశారు."వాళ్లు తప్పు చెబుతున్నారు. అణు తనిఖీలకు సంబంధించి మాకు 100 శాతం హామీ ఉంది. వారు అలా అంగీకరించకపోయి ఉంటే నేను ఇప్పుడే చర్చలను రద్దు చేసేవాడిని. తగిన సమయంలో తనిఖీ బృందాలు అక్కడికి వెళ్తాయి.

మిగతా 2లో..



## 'సర్'లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వకపోవడమేంటీ?

బెంగాల్ ప్రభుత్వం నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సుప్రీం

ఈ అంశంపై విచారణకు ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని పిటీషనర్‌కు సూచన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం

మిగతా 9లో..

## విద్యార్థులను ఉగ్రవాదులంటారా?

ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాల్సిందే: ఖర్గే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి విద్యార్థులు చేపట్టిన నిరసనలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రచర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై, విద్యాశాఖ మంత్రిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రశ్నించే వారిని ఉగ్రవాదులుగా ముద్ర వేస్తోందని

మిగతా 9లో..



# ఇరాన్ అణు కేంద్రాల్లో మళ్లీ తనిఖీలు

– యూఎన్ అణుశక్తి సంస్థ చీఫ్ రఫెల్ మారియానో గ్రోస్సీ కీలక ప్రకటన కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఇరాన్‌లోని అణు ఇంధన శుద్ధి కేంద్రాలను ఐఏఈఏ తనిఖీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అణు కార్యకలాపాల పర్యవేక్షణలో ఐఏఈఏ పాత్ర అత్యంత కీలకమని, తనిఖీలు తప్పనిసరిగా జరుగుతాయని పేర్కొన్నారు. జపాన్‌లోని ఫుకుషిమా దైచీ అణు విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన గ్రోస్సీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై తనిఖీల విషయంలో అమెరికా, ఇరాన్ నుంచి విభిన్న ప్రకటనలు వస్తున్నప్పటికీ, ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇరాన్ అణు కేంద్రాల తనిఖీలపై వస్తున్న సందేహాలకు గ్రోస్సీ సమాధానం ఇచ్చారు. రాజకీయ నాయకుల ప్రకటనలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉండవచ్చని, అయితే అధికారిక ఒప్పందంలోని అంశాలే ముఖ్యమని పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ అధ్యక్షులు సంతకం చేసిన అవగాహన ఒప్పందంలో అణు పదార్థాలు, అణు కేంద్రాలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఐఏఈఏ పర్యవేక్షణలోనే జరగాలని స్పష్టంగా ఉందన్నారు. "తనిఖీలు జరగకుండా పర్యవేక్షణ సాధ్యం కాదు. రెండు రోజుల్లోనా, వారం రోజుల్లోనా, పది రోజుల్లోనా అనేది ముఖ్యం కాదు. కానీ తనిఖీలు మాత్రం తప్పకుండా జరుగుతాయి" అని గ్రోస్సీ స్పష్టం చేశారు.

యురేనియం నిల్వలే ప్రధాన ఆందోళన

ఇరాన్ వద్ద ప్రస్తుతం అధిక స్థాయిలో శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ అంచనాల ప్రకారం, ఆ నిల్వలు అవసరమైతే దాదాపు 10 అణు బాంబులు తయారు చేయడానికి సరిపోతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాల కోసమేనని ఇరాన్ ఎప్పటినుంచో చెబుతోంది. అయినప్పటికీ ప్రపంచంలో అణ్వాయుధ కార్యక్రమం లేకుండానే 60 శాతం వరకు యురేనియం శుద్ధి చేసిన ఏకైక దేశంగా ఇరాన్ ఉండటం అనుమానాలకు తావిస్తోంది. దీంతో ఐఏఈఏ తనిఖీలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

యుద్ధం తర్వాత నిలిచిపోయిన తనిఖీలు

2025లో ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య 12 రోజుల పాటు జరిగిన యుద్ధం తర్వాత ఐఏఈఏ తనిఖీలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా యురేనియం శుద్ధి కేంద్రాలకు ఐఏఈఏ అధికారులను అనుమతించలేదు. అక్కడే అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని భావిస్తున్నారు. అయితే బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం వంటి ఇతర ప్రాంతాలను ఐఏఈఏ సందర్శించగలిగింది. కానీ ప్రధాన శుద్ధి కేంద్రాలకు ప్రవేశం లేకపోవడంతో యురేనియం నిల్వల స్థితి, సెంట్రిఫ్యూజ్‌ల పనితీరుపై స్పష్టత లేకుండా పోయింది. ఐఏఈఏ, ఇరాన్ రెండూ ప్రస్తుతం యురేనియం శుద్ధి కార్యక్రమం కొనసాగడం లేదని చెబుతున్నప్పటికీ, అణు వ్యాప్తి నిరోధక నిపుణులు మాత్రం ఆ నిల్వలను రహస్య ప్రాంతాలకు తరలించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాతో ఒప్పందంలో క్షిపణి కార్యక్రమానికి చోటు లేదు

సంతరించుకుంది. క్షిపణి కార్యక్రమం గురించి ఎంఓయూలో ఎలాంటి చర్చ లేదని మసూద్ పెజెష్కియాన్ చెప్పారు. భవిష్యత్తులో కూడా అలాంటి అంశం ఉండదని స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలను ఇరాన్ రక్షణ సామర్థ్యాలతో ముడిపెట్టే ప్రయత్నాలను ఆయన తిరస్కరించారు. దేశ రక్షణ వ్యూహంలో క్షిపణి వ్యవస్థలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇరాన్ భద్రత కోసం క్షిపణి సామర్థ్యం అత్యవసరమని పెజెష్కియన్ వ్యాఖ్యానించారు. తమ దేశ రక్షణ కోసం ఉన్న క్షిపణులు లేకపోయి ఉంటే ఇజ్రాయెల్, అమెరికా ఇప్పటికే ఇరాన్‌ను తీవ్రంగా దెబ్బతీసేవని ఆయన అన్నారు. ఇరాన్ తన రక్షణ అవసరాల దృష్ట్యా క్షిపణి కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని, దానిపై రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# అణు తనిఖీలకు అంగీకరించకపోతే చర్చలు రద్దు చేస్తా

ఇప్పుడే తొందరపడాల్సిన అవసరం లేదు. ఇరాన్‌తో మేము చాలా బాగా ముందుకు వెళ్తున్నాం. వారు తీవ్రంగా బలహీనపడ్డారు. ఇప్పుడు వారితో ఒక ఒప్పందం చేసుకునే దిశగా కదులుతున్నాం. అది ఎలా ముందుకు సాగుతుందో చూద్దాం. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇరాన్ అణ్వాయుధాలను పొందదు. ఇరాన్‌ను ఇంత బలహీన స్థితిలోకి తీసుకువచ్చిన అమెరికా ప్రభుత్వం ఇప్పటివరకు లేదు. వారి సైనిక సామర్థ్యాలు, నాయకత్వ వ్యవస్థ, రాడార్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని ట్రంప్ అన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలకు ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల స్విట్జర్లాండ్‌లో సాంకేతిక చర్చలు జరిగాయి. ఈ చర్చల అనంతరం అమెరికా ప్రభుత్వం 14 అంశాల అవగాహన ఒప్పందానికి సంబంధించిన అధికారిక పాఠాన్ని విడుదల చేసింది. అమెరికా మీడియా కథనాల ప్రకారం, ఆ ఒప్పందంలో హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం, ఇరాన్‌పై కొన్ని ఆర్థిక ఆంక్షల సడలింపు, ఇరాన్ అణు కార్యక్రమంపై భవిష్యత్ సాంకేతిక చర్చలకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అయితే అమెరికా విడుదల చేసిన పత్రంలో ఇరాన్ క్షిపణి కార్యక్రమం లేదా విస్తృత రక్షణ సామర్థ్యాలపై ఎలాంటి పరిమితులు విధించే అంశాలు లేవు. ఆయుధాలకు సంబంధించిన అంశాల్లో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదు, కొనుగోలు చేయకూడదు అనే నిబంధన మాత్రమే స్పష్టంగా ప్రస్తావించబడింది.

**హర్మూజ్‌లో ఎటువంటి సుంకాల్లేవ్ : ట్రంప్**

హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. జలసంధి మార్గంలో ప్రయాణించే నౌకల నుంచి ఎటువంటి సుంకాలు, బీమా ఖర్చులు లేదా ఇతర ఏవిధమైన రుసుములూ వసూలు చేయమని ఇరాన్ హామీ ఇచ్చిందన్నారు. ఒకవేళ ఇది తప్పుడు సమాచారమైతే, వారితో చర్చలను వెంటనే నిలిపివేస్తామన్నారు. ఇక ఇరాన్‌కు నేరుగా ఎటువంటి నిధులు విడుదల చేయడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. మొక్కజొన్న, గోధుమ, సోయాబీన్ తదితర ఆహార పదార్థాలను కొనుగోలు చేసేందుకు వారికి (ఇరాన్‌కు) సంబంధించిన నిధుల్లోంచి కొంత మొత్తాన్ని అమెరికా రైతులు, పశుపోషకులకు విడుదల చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇరాన్‌కు ఆహార పదార్థాలు అత్యవసరమని, వాటిని ప్రత్యేకంగా అమెరికా నుంచే కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు. హర్మూజ్‌లో ఇటీవల ట్రాఫిక్ పెరిగిందని, రికార్డు స్థాయిలో చమురు రవాణా జరుగుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. వీటికి సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఓ అమెరికా వార్తా సంస్థ పేర్కొన్న వివరాల ప్రకారం.. జూన్ 12–14 తేదీల్లో 32 నౌకలు హర్మూజ్‌ను దాటగా.. 19–21 తేదీల్లో 93 నౌకలు సురక్షితంగా జలసంధిని దాటినట్లు తెలుస్తోంది.

**ఇరాన్ అమెరికాను గౌరవిస్తే ఎలాంటి సమస్యలు ఉండవు:ట్రంప్**

యుద్ధం శాశ్వతంగా ముగిసిన తర్వాత శాంతి కొనసాగాలంటే ఇరాన్ అమెరికాను గౌరవించాల్సిందేనని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి పూర్తిగా తెరుచుకుంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మళ్లీ ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైట్ హౌస్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన ట్రంప్, "భయం అనే పదాన్ని ఉపయోగించాలనుకోవడం లేదు. కానీ ఇరాన్ అమెరికాను గౌరవిస్తే ఎలాంటి సమస్యలు ఉండవు" అని పేర్కొన్నారు. యుద్ధం ముగిసిన తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయని ఆయన అన్నారు. అమెరికా– ఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత హర్మూజ్ జలసంధిలో నౌకాయాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన ఈ మార్గం దాదాపు మూతపడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు భారీగా పెరిగాయి. అయితే తాజాగా కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం తర్వాత పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి.

# తుంగభద్ర నీటివాటా తెలంగాణ హక్కు



గుర్తించాలని కోరారు. రాజోలి బండ డైవర్సన్ కెనాల్ ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ. 59 కోట్లు డిపాజిట్ చేసిందని, పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని అన్నారు. ప్యాకేజీ 1,2 పనులు ఇప్పటికీ చేపట్టలేదని, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తి అయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలని రేపు కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సీఎంలతో జరిగే సమావేశం లో ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల ఆశించిన విధంగా నీటిని మళ్ళింపు సాధ్యం కావడం లేదని ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2004 లో నిపుణుల కమిటీ పూడిక తొలిగించాలని సూచించింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు ఇప్పటికి అమలు కాలేదని చర్చ జరిగింది. వెంటనే పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉండటంతో ఆ రాష్ట్ర సహకారం కోరాలని నిర్ణయం తీసుకున్నారు. పూడికతీత తో పాటు 2004లో నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతి పత్రం అందించాలని ముఖ్య మంత్రి సూచించారు. అప్పటి నివేదికకు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితిని విశ్లేషించుకోవాలని సూచించారు. వెంటనే పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు. తుమ్మిళ్ల నుంచి నీటిని వినియోగించుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ పెంచాలని, వీలైనంత వేగంగా పనులను చేపట్టాలని ముఖ్యమంత్రి అదేశించారు.

# 'సర్'పై నిర్లక్ష్యం సహించం

హైదరాబాద్(జనంసాక్షి):

ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# తెలంగాణలో నేటి నుంచి 'సర్'

అందజేయాలి. అలా చేసిన ఎన్యూమరేషన్ ఫారమ్స్‌ను బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలించి ఓటును నిర్ధారిస్తారు.

**బీఎల్ఏలకు శిక్షణ :** ఇందుకు గాను హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 4,062 పోలింగ్ స్టేషన్లలో 47,36,669 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఇప్పటికే 22 లక్షల 9 వేల 647 మంది ఓటర్లు మ్యాపిం గ్ చేశారు. ఇంకా 25 లక్షల 27 వేల 22 మంది ఓటర్లను మ్యాపింగ్ చేయాల్సి ఉంది. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసేందుకు జిల్లావ్యాప్తంగా 4,062 మంది బీఎల్‌వోలను నియమించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన 10,901 మంది బీఎల్ఏలను నియామకం పూర్తి చేసి వారికి తగిన శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఓటు వేయాలంటే ఓఆర్ఆర్ లోపల ఉండే రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లోని ఓటర్ల సమగ్ర సర్వేకు ఆ జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బీఎల్‌వో, బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చారు. అయితే తన ఓటు ఎక్కడ ఉంచుకోవాలనేది పూర్తి స్వేచ్ఛ ఓటరుకే ఉందని, అక్కడ మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాల్సి ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో చాలా మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఉన్న వారు ఇంతకు ముందు ఓటు హక్కు వినియోగించుకున్న ప్రాంతంలోనే ఎన్యూమరేషన్ చేసుకోవాలి. తుది ఓటరు జాబితాలో వారి పేరు వచ్చాక ఒక వేళ హైదరాబాద్‌లో ఓటు వేయాలంటే ట్రాన్స్ ఫర్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!

విరమణ చేయనుండగా, కొత్త ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజుతో పాటు జయేశ్‌రంజన్ పేర్లను పరిశీలించిన ముఖ్యమంత్రి చివరకు జాజు వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్‌కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. జాజును సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఆయన 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉంటారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఆయనపై నమోదైన కేసులను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన ఎన్నికల కోడ్ ఉల్లంఘించారన్న ఫిర్యాదుతో కేసులు నమోదయ్యాయి. వాటిని కొట్టేయాలంటూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో 5 వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. విచారించిన ఉన్నత న్యాయస్థానం.. ఆ 5 కేసులను కొట్టివేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ నుంచి ఎంపీగానూ ఆయన విజయం సాధించారు. దీంతో ఉత్తమ్.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో హుజూర్‌నగర్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది.

# బాల్క సుమన్‌కు హైకోర్టులో ఊరట

ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్‌కు రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరి పూచీకత్తు సమర్పించాలనే నిబంధనపై బెయిల్ లభించింది. వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్ట్ భయం లేకుండా ఈ బెయిల్ నిర్ణయం ఆయనకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేయడం జరిగింది.

# వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు..

**మోదీకి పిలుపు**

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దౌత్య వర్గాలు బుధవారం వెల్లడించాయి. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటనేదీ రాలేదు. జులై 5 నుంచి 9 వరకు ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. తొలుత టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నారు. 9వ తేదీన ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ, మరో 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ కుటుంబంలో కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందగా.. కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అలీ ఖమేనీ మరణంతో.. మొజ్తాబాను సుప్రీం లీడర్‌గా ఎన్నుకొన్న సంగతి తెలిసిందే.

# మహారాష్ట్రను ముంచెత్తిన వర్షాలు.

**విరిగి పడిన కొండ చరియలు**

**ముంబై(జనంసాక్షి):**మహారాష్ట్ర రాజధాని ముంబయితో పాటు ఠాణె, పాల్ఘర్‌లను భారీ వర్షాలు ముంచెత్తాయి. పలు ప్రాంతాలు, రహదారులు జలదిగ్బంధం కావడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఠాణె–పుణె మధ్య కీలక మార్గమైన మాల్షేజ్ ఘాట్‌లో చెట్లు, కొండ చరియలు విరిగిపడటంతో.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముంబయిలోని పలు ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అంధేరి ప్రాంతంలోని సబ్‌వే (అండర్‌పాస్) పూర్తిగా నీట మునిగింది.

# ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీగడపకూ అభివృద్ధి,సంక్షేమం

కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# మళ్లీ కేసీఆరే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు

రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌పోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

హైదరాబాద్(జనంసాక్షి): తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్–కమ్–బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ. 85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? అని ప్రశ్నించారు.

# బోగస్ ఓట్లను మాత్రమే తొలగించాలి

హైదరాబాద్,జూన్24(జనంసాక్షి): బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ప్రత్యేక సవివర ఓటరు జాబితా సవరణపై ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకుడు కురువ విజయ్ సీఈవో సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 'ఒక వ్యక్తి ఒక ఓటు' సూత్రాన్ని కచ్చితంగా అమలు చేసి, ద్వంద్వ ఓటరు నమోదులను గుర్తించి తొలగించాలని బీఆర్ఎస్ నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పునాదులను విధ్వంసం చేసేటటువంటిది.. రాజ్యాంగ స్ఫూర్తిని సర్వనాశనం చేసేటటువంటిది. పవిత్రమైన ఎన్నికల పక్రియను పూర్తిగా భ్రష్టు పట్టించే పక్రియ డూప్లికేట్ ఓటర్లు అని అన్నారు. ఈ బోగస్ ఓటర్లు, డూప్లికేట్‌ఓటర్ల వల్ల పవిత్రమైన ప్రజాస్వామ్య యుత ఎన్నికల పక్రియను సర్వనాశనం చేస్తున్నారో దాన్ని సరిదిద్దడం కోసమే మేం ముందుకొచ్చామని కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్లు చెబుతూ ఎస్ఐఆర్ అనే పక్రియను మనముందుకు తీసుకొచ్చింది. కేసీఆర్, బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు ప్రజలంతా పెద్ద ఎత్తున ఈ ఎస్ఐఆర్ పక్రియలో భాగస్వామ్యులవుతున్నారన్నారు.



## దొంగ నోట్ల తయారీ ముఠా అరెస్ట్

- దేవరుప్పుల మండల కేంద్రంలో ఘటన

**పాలకుర్తి/ దేవరుప్పుల, జూన్ 24 (జనంసాక్షి) :** జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో చింత సుదర్శన్ నివాసంలో దొంగ నోట్లు తయారు చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. వెంటనే దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించగా, అక్కడ జగిత్యాల జిల్లాకు చెందిన సయ్యద్ రసూల్, కడవెండి గ్రామానికి చెందిన బషిపాక అంజయ్య, దేవరుప్పుల గ్రామానికి చెందిన చింత సుదర్శన్. బండకోతపల్లి గ్రామానికి చెందిన గోపాలదాస్ లక్ష్మయ్య. దొంగ నోట్ల తయారీలో నిమగ్నమై ఉన్నట్లు గుర్తించారు.వారి వద్ద నుండి ఒక ప్రింటర్, ఒక వైపు మాత్రమే ముద్రించిన 500 నోట్ల నమూనాలు గల 150 ఏ4 పేపర్లు సుమారు 3 లక్షల విలువ, 8 నల్ల కాగితాల కట్టలు, ఒక బ్రిజా కారు, 85,000 నగదు నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి,వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య ఆధ్వర్యంలో నిందితులను రిమాండ్‌కు తరలించారు.



## విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాం

- చెన్నూర్‌లో 33 కెవి దేవులావాడ ఫీడర్‌ను ప్రారంభించిన టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

**చెన్నూర్, జూన్ 24 (జనంసాక్షి) :** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రత్యామ్నాయ విద్యుత్ మార్గాల ఏర్పాటు, ఆధునిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో పర్యటించిన సీఎండీ, 132/33 కేవీ చెన్నూర్ సబ్‌స్టేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థ, లోడ్ పరిస్థితులు, పరికరాల పనితీరు, భవిష్యత్ అవసరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన 33 కెవి దేవులవాడ ఫీడర్‌ను ప్రారంభించారు. కొత్త ఫీడర్ ద్వారా సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా మారడంతో పాటు లోడ్ మెరుగుపడి వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. అనంతరం వేమనపల్లి – కోటపల్లి ప్రాంతాల మధ్య ఇంటర్‌లింకింగ్ లైన్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ లైన్ల నిర్మాణం ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా మార్గాలు ఏర్పడి అత్యవసర పరిస్థితుల్లో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలపై నివేదిక సిద్ధం చేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. తదనంతరం చెన్నూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ, అక్కడి విద్యుత్ సరఫరా పరిస్థితులు, ఫీడర్ వారీ లోడ్లు, నిర్వహణ ప్రమాణాలు , వినియోగదారుల అవసరాలపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ అంతరాయాలను తగ్గిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా కొత్తగా నిర్మిస్తున్న ఉన్న ఎస్పీఎం (ర్రావీ) షెడ్ పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెన్నూర్‌లో నిర్మాణంలో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనాన్ని కూడా పరిశీలించిన సీఎండీ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా ఆధునిక సౌకర్యాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందే విధంగా కార్యాలయాలను అభివృద్ధి చేయడం సంస్థ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎస్ఈ బి.రాజన్న, డిఈ ఆపరేషన్ మంచిర్యాల ఎంఎం కైజర్, డీఈ టెక్నికల్ మల్లేశం, ఈఈ సివిల్ శ్రీనివాస్, ఏడీఈలు వెంకటేశ్వర్లు , శరత్ , రాజ శేఖర్, రామచంద్రం, ఏఈ అన్నం రమేష్, జయ కృష్ణ, ఖలీమ్, శంకర్, శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 6 నెలల చిన్నారి కడుపులో భారీ కణితి తొలగింపు..

- ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ అరుదైన ఘనత



**హైదరాబాద్, జూన్ 24 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ప్రముఖ వైద్య సంస్థ ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ డాక్టర్లు వైద్య రంగంలో అరుదైన అద్భుతాన్నిసాధించారు. కేవలం 6 కిలోల బరువున్న ఓ 6 నెలల ఆడపాప కడుపు నుండి అత్యంత అరుదైన, 500 గ్రాముల బరువున్న భారీ కణితిని శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. సర్జరీ జరిగి నెల రోజులు గడుస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆ చిన్నారి పూర్తి ఆరోగ్యంతో చురుగ్గా ఉంటూ, సకాలంలో పాలు తాగుతూ, వయసుకు తగ్గట్టుగా బరువు పెరుగుతోంది. పాప కడుపు భాగం అసాధారణంగా ఉబ్బిపోవడం, అలాగే వయసుకు తగ్గట్టుగా బరువు పెరగకపోవడాన్ని గమనించిన తల్లిదండ్రులు చిన్నారిని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం, పాప కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే మరిన్ని నిర్ధారణ పరీక్షల కోసం ఇమేజింగ్ స్టడీస్‌ను సిఫార్సు చేశారు. అల్ట్రాసౌండ్ పరీక్షలో కణితి ఉన్నట్లు స్పష్టమైంది. కణితి పరిమాణం చాలా పెద్దదిగా ఉండటం వల్ల, అది చుట్టుపక్కల ఉన్న ఇతర అవయవాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉందని గుర్తించిన మల్టీ డిసిప్లినరీ వైద్యుల బృందం, ఆలస్యం చేయకుండా వెంటనే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. సుమారు 4 గంటల పాటు అత్యంత సంక్లిష్టంగా సాగిన ఈ ఆపరేషన్‌లో వైద్యుల బృందం చిన్నారి శరీరంలోని ఇతర ముఖ్యమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, ఆ 500 గ్రాముల కణితిని సురక్షితంగా, పూర్తిగా తొలగించగలిగారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారిని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి నిరంతరం పర్యవేక్షించారు. క్రమంగా వెంటిలేటర్ మద్దతును తొలగించగా.. పాప శరీరంలోని అన్ని కీలక అవయవాలు స్థిరంగా పనిచేయడం ప్రారంభించాయి. ఆ తర్వాత చిన్నారికి పాలు ఇవ్వడం ప్రారంభించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పాప వేగంగా కోలుకోవడంతో, శస్త్రచికిత్స జరిగిన ఐదో రోజే ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేశారు. తర్వాత నిర్వహించిన హిస్టోపాథాలజికల్ (బయాప్సి) పరీక్షలో అది ప్రాణాంతకం కానీ, కేవలం ఒక 'బెనిన్ మెచ్యూర్ సిస్టిక్ టెరాటోమా' రకానికి చెందిన కణితిగా నిర్ధారణ అయింది.

# క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తా

- జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ములుగు క్రీడాకారులు.
- క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండ
- క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జూన్ 24(జనంసాక్షి) :** క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తాను చాటుతుందని,జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ములుగు క్రీడాకారులు రాణిస్తున్నారని,క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజా ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని, క్రీడాకారుల కోసం అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ 4 కోట్లు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, భారత ఒలింపిక్ సంఘం, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ తో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా మారుమూల ప్రాంతం అయినప్పటికీ క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందుతోందన్నారు. జిల్లాకు చెందిన అనేక మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి దేశ విదేశాల్లో ములుగు ఖ్యాతిని చాటుతున్నారని తెలిపారు. పేదరికం, వెనుకబడిన పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని పిల్లల్లో ఉన్న ప్రతిభ అపారమని,వాలీబాల్, ఆర్చరీ వంటి క్రీడల్లో ములుగు జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించిన చరిత్ర ఉందన్నారు. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో కూడా విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జిల్లాలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అథ్లెటిక్స్ స్టేడియం ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదన మేరకు రూ 4 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయించామని, భవిష్యత్తులో అవసరమైన అదనపు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు క్రీడలపై పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న క్రీడలో విజయం సాధించి ములుగు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని,తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షిస్తూ మంత్రి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈవో సిద్ధార్థ రెడ్డి, డిఎస్పి రవీందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పగడాల వెంకటేశ్వర రెడ్డి, పీడీలు, పిఈటి లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

- ఒలంపిక్ రన్ ప్రారంభించిన మెదక్ ఎంపి రఘునందన్ రావు



**సిద్దిపేట, జూన్24 (జనంసాక్షి) :** డ్రగ్స్ నిషేధానికి ప్రతి జూన్ 23వ తేదీన ఒలింపిక్ డేను నిర్వహిస్తున్నామని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. నశా ముక్త భారత్ కింద మళ్లీ ఈ ర్యాలీ చేపడుతున్నామని పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఒలింపిక్ రన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ రన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎండలో ఉంచడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. డీ విటమిన్ కోసం ఒక ట్యాబ్లెట్ వేస్తున్నారు కానీ ఎండలో మాత్రం ఉంచట్లేదని తెలిపారు. యోగాతో ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించారు. ఒలింపిక్స్ క్రీడలను తాము చిన్నపుడు చూసేదని.. ఇండియాకి ఎన్ని కప్పులు వచ్చాయో అని తెలుసుకునే వాళ్లమని అన్నారు. ఎప్పుడు కూడా చైనా ఒలింపిక్స్‌లో మొదటగా వచ్చేదని.. మనం మాత్రం కింది స్థానంలో ఉండే వాళ్లమని వెల్లడించారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత క్రీడలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలు అలవాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా మన దేశానికి కావాల్సింది భగవద్గీత పుస్తకాలు కాదని.. క్రీడా మైదానాలు కావాలని అన్నారు. మన దేశంలో ఉన్నా క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటకు ఇంత పెద్ద గ్రౌండ్ ఉండటం చాలా అదృష్టమని.. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్ష



**వరంగల్ బ్యూరో జూన్ 24( జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ కళాశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం తో పాటు నాణ్యమైన విద్యను అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి మిడ్‌డే మిల్ కమిటీ సమావేశంలో పథకం అమలు తీరును సమీక్షించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార పదార్థాల నిల్వ మరియు పంపిణీ విధానాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని, భోజన తయారీ మరియు పంపిణీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలకు ప్రత్యేక అధికారులను నియమించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వైవీ గణేష్ ను ఆదేశించారు. కళాశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరించి అవసరమైన మెరుగుదల చర్యలు చేపట్టాలని, మధ్యాహ్న భోజన పథకం లక్ష్యాలకు అనుగుణంగా అమలు జరిగేలా సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, టిబిసిడి పుష్పలతసంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- ప్రతి అర్హుడైన ఓటరికి సమాచారం అందేలా అవగాహన కల్పించాలి
- గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి
- ములుగు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 24(జనంసాక్షి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం – 2026 (ఎస్ఐఆర్) పై జిల్లాలో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబధిత ఆదేశించారు. బుధవారం జిల్లా ఎన్నిక అధికారి,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం – 2026 పై విస్తృత అవగాహన కల్పించడం పై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అందిన ఆడియో, వీడియో ప్రచార సామగ్రిని అన్ని కమ్యూనికేషన్ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రచారం ద్వారా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అర్హత లేని పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ప్రతి అర్హుడైన ఓటరికి సమాచారం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణ వేణి, తహసీల్దార్లు, ఎలక్షన్ సెల్ అధికారులు, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి మనవరాలు మృతి

- తట్టుకోలేక నానమ్మ గుండెపోటుతో హఠాన్మరణం

**జనగామ, జూన్24 (జనంసాక్షి) :** జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. మనవరాలు మృతి చెందిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే నానమ్మ గుండెపోటుతో మరణించింది. అంబేద్కర్ నగర్‌కు చెందిన ప్రియాన్ని (18 నెలల) అనే చిన్నారి ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి నీళ్ల సంపులో పడి మృతి చెందింది. మనవరాలి మృతితో ఏడుస్తూ నానమ్మ మారబోయిన నాగమ్మ (65) గుండెపోటుకు గురై మృతి చెందారు. ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో అంబేద్కర్ నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## రెచ్చిపోయిన వీధి కుక్కలు

- ఆరుగురిపై దాడిచేసి గాయపరచడంతో ఆస్పత్రికి తరలింపు



**జగిత్యాల, జూన్24 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుడిసెల పేట గ్రామంలో బుధవారం పిచ్చికుక్కలు రెచ్చిపోయాయి. వీర విహారం చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచాయి. గుడిసెల నరసమ్మ ముఖంపై తీవ్రంగా గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో ఐదుగురిని చాతిలో , తలకు, ముఖం, కాళ్లకు పై దాడి చేయగా గాయాలయ్యాయి. వీరందరినీ హుటాహుటినా అంబులెన్స్ లో జగిత్యాల ప్రభుత్వ దవఖానాకు తరలినీచి చికిత్స అందిస్తున్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తి

- వారం రోజులపాటు జైలు శిక్ష విధించిన కోర్టు

**నిజామాబాద్, జూన్24 (జనంసాక్షి) :** మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు ఏడు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించిందని ఐదవ టౌన్ ఎస్సై సునీల్ వెల్లడించారు. స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన సమయంలో షేక్ హబీబ్ అనే వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లుగా నిర్దారణ అయినట్లు ఎస్సై వివరించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి బుధవారం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా కోర్టు శిక్ష విధించిందని వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు సదరు నిందితుడిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు డ్రైవ్ చేయవద్దని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.


EDITORIAL

## తెలంగాణకు నీటి అన్యాయం

కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో నీటి పంపిణీ వ్యవహారం తెలంగాణకు మొదటి నుండీ అన్యాయంగానే సాగుతోంది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత తెలంగాణ నీటి హక్కులు ఏ విధంగా కోల్పోయాయో రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ చరిత్ర స్పష్టంగా చెప్తుంది. కేసీ కాలువకు ఎగువన నిజాం సర్కార్ నిర్మించిన రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు నిర్ణయించిన నీటి వాటా 15.9 టీఎంసీలు. అలంపూర్, గద్వాల ప్రాంతాల్లో 150 కిలోమీటర్ల పొడవున 75 గ్రామాలను సస్యశ్యామలం చేయాల్సిన ఈ నీరు కేవలం తెలంగాణ సరిహద్దు వరకే వస్తోంది. అక్కడ నుండి ముందుకు సాగడం లేదు. ఆచరణలో వస్తున్నది కేవలం నాలుగైదు టీఎంసీలు మాత్రమే. హక్కుగా దక్కాల్సిన నీటిలో పావు వంతు కూడా తెలంగాణ రైతుల పొలాలకు చేరడం లేదు. కర్ణాటక రాష్ట్రం ఆర్డీఎస్ పరిధిలో తన ఆయకట్టును నిరంతరం పెంచుకుంటూ వెళ్తోంది. ఎగువ రాష్ట్రం అనే భౌగోళిక ప్రయోజనాన్ని పూర్తిగా వాడుకుంటూ అందుబాటులో ఉన్న నీటిని తాను వినియోగించుకుంటోంది. దిగువన ఉన్న తెలంగాణకు సరిపడా నీరు విడుదల చేయడం లేదు. ఇది ఒడంబడికలకు, అంతర్రాష్ట్ర నీటి పంపిణీ సూత్రాలకు విరుద్ధం. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో తెలంగాణకు హామీ ఇచ్చిన నీటి వాటాలు అమలుకు నోచుకోలేదు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు కాగితాల మీదే ఉన్నాయి. అలంపూర్, గద్వాల రైతులు దశాబ్దాలుగా తమకు రావాల్సిన నీటి కోసం వేచి చూస్తున్నారు. ఎండిపోతున్న పొలాలు, తగ్గిపోతున్న దిగుబడులు ఇవే వారి జీవితాల్లో మిగిలిన వాస్తవాలు. తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీవ్రంగా తీసుకెళ్ళాలి. కృష్ణా నది నీటి పంపిణీ బోర్డు ద్వారా కర్ణాటకపై ఒత్తిడి తీసుకు రావాలి. ఆయకట్టు పెంపు పేరిట ఒక రాష్ట్రం మరో రాష్ట్రం హక్కులను కాజేయడం అంతర్రాష్ట్ర సంబంధాలకు మంచిది కాదు. నీరు జీవనాధారం, అది హక్కు - దయాదాక్షిణ్యం కాదు. తెలంగాణ రైతు తన వాటా నీటికి మరెంత కాలం అర్రులు చాచాలి?

# విద్యకు మాటలు చాలవు - ఆచరణ కావాలి

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో ప్రజలు కలగన్న ప్రధాన ఆశయాలలో ఒకటి నాణ్యమైన, అందరికీ అందుబాటులో ఉండే విద్యా వ్యవస్థ. దశాబ్దానికి పైగా గడిచినా విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం పూర్తిగా తొలగిపోలేదు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లోపం, ప్రభుత్వ విద్యపై తగ్గుతున్న నమ్మకం, ప్రైవేటీకరణ ప్రభావం, నాణ్యత సమస్యలు, పరిశోధనలో వెనుకబాటు వంటి అంశాలు తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి.**




ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ విద్యారంగంపై సమగ్ర అధ్యయనం చేసి వందలాది సిఫార్సులతో నివేదిక సమర్పించడం ఒక ముఖ్యమైన పరిణామం. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిషన్ ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయ విద్య వరకు అనేక నిర్మాణాత్మక మార్పులను సూచించింది. కమిషన్ 305 పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నిపుణులతో చర్చించి 434 సిఫార్సులు సమర్పించినట్లు వెల్లడించింది. అయితే ప్రశ్న ఏమిటంటే, ఆ సిఫార్సులు ఎంతవరకు అమలులోకి వచ్చాయి? ప్రభుత్వ చర్యలు వాటి దిశగా సాగుతున్నాయా? అనే అంశం. కమిషన్ నివేదికలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెంచడం, ప్రతి మండలంలో సరిపడా పాఠశాలలు ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయడం, ప్రైవేటు పాఠశాలల ఫీజులను నియంత్రించడం, జూనియర్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడం వంటి కీలక సూచనలు ఉన్నాయి. కానీ విద్యావేత్తలు, ప్రతిపక్షాలు, పౌరసంఘాలు చెబుతున్నదేమిటంటే నివేదిక శాసనసభలో సమగ్ర చర్చకు రావడం, దాని అమలుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించడం ఇప్పటివరకు జరగలేదని.

ఆకునూరి మురళి తన పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయడం కూడా అనేక ప్రశ్నలకు దారితీసింది. అధికారికంగా ఆయన నివేదిక సమర్పణతో తన బాధ్యత పూర్తయిందని పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం ముఖ్యంగా ఫీజుల నియంత్రణ వంటి సిఫార్సులను అమలు చేయడంలో ఆలస్యం చేస్తోందన్న అభిప్రాయాలు మీడియాలో వ్యక్తమయ్యాయి. ఇది ఒక పెద్ద సమస్యను సూచిస్తుంది. మన దేశంలో, ముఖ్యంగా రాష్ట్రాల్లో, కమిటీలు ఏర్పాటు చేయడం సులభం. కానీ వాటి నివేదికలను అమలు చేయడం మాత్రం అరుదు. విద్యా సంస్కరణలు రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాలి. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం వల్ల పాఠశాలల విలీనాలు, మూసివేతలు జరిగాయి. మరోవైపు ప్రైవేటు విద్యాసంస్థలపై ఆధారపడే కుటుంబాల సంఖ్య పెరిగింది. ఫీజుల భారం మధ్యతరగతి, పేద కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. కమిషన్ కూడా విద్యా వాణిజ్యీకరణపై ఆందోళన వ్యక్తం చేస్తూ కఠిన నియంత్రణ వ్యవస్థను సిఫార్సు చేసింది. అయినప్పటికీ ప్రతి ఏడాది ప్రైవేటు పాఠశాలలు భారీగా ఫీజులు పెంచుతున్నాయన్న విమర్శలు కొనసాగుతున్నాయి.

విద్యావేత్తలు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు చాలా కాలంగా ఒకే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. కొత్త భవనాలు కట్టడం మాత్రమే విద్యా సంస్కరణ కాదు; ఇప్పటికే ఉన్న వేలాది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడమే నిజమైన సంస్కరణ అని వారు వాదిస్తున్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం పెరగాలంటే నాణ్యమైన బోధన, సరిపడా ఉపాధ్యాయులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, డిజిటల్ వసతులు అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం విద్యకు కేటాయించాలని కూడా కొందరు నిపుణులు డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. అనేక విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత తీవ్రమైంది. పదవీ విరమణల తర్వాత కొత్త నియామకాలు జరగకపోవడం వల్ల కాంట్రాక్ట్ అధ్యాపకులపై ఆధారపడాల్సి వస్తోందని అధ్యాపక సంఘాలు చాలా కాలంగా చెబుతున్నాయి. పరిశోధన, అకాడమిక్ నాణ్యత, జాతీయ ర్యాంకింగ్స్‌పై దీని ప్రభావం పడుతోంది. ఉన్నత విద్యలో మౌలిక సదుపాయాలు, పరిశోధన నిధులు, అధ్యాపక నియామకాలు లేకుండా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల కలలు సాకారం కావు. ఇదే సమయంలో ప్రభుత్వం కూడా కొన్ని చర్యలు తీసుకున్నదనే వాస్తవాన్ని విస్మరించలేం. వేలాది ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, బదిలీలు, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ పరికరాల పంపిణీ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విస్తరణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. అయితే సమస్యల పరిమాణంతో పోల్చితే ఇవి ప్రారంభ దశ చర్యలుగానే కనిపిస్తున్నాయి. విద్యా వ్యవస్థలో దశాబ్దాలుగా పేరుకుపోయిన లోపాలను సరిచేయడానికి మరింత పెద్ద స్థాయి పెట్టుబడులు అవసరం.

అసలు తెలంగాణ విద్యారంగం ఎదుర్కొంటున్న మూల సమస్య నిధుల కొరత మాత్రమే కాదు; ప్రాధాన్యతల కొరత కూడా. రోడ్లు, భవనాలు, భారీ ప్రాజెక్టులు కనిపిస్తాయి. కానీ ఒక మంచి ఉపాధ్యాయుడి ప్రభావం, ఒక బలమైన ప్రభుత్వ పాఠశాల విలువ వెంటనే కనిపించవు. అందుకే విద్య తరచూ రాజకీయ అజెండాలో వెనుకబడిపోతుంది. కానీ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది మౌలిక సదుపాయాల కంటే మానవ వనరులే. నేడు విద్యలో పెట్టిన ప్రతి రూపాయి రేపటి ఆర్థికాభివృద్ధి, సామాజిక సమానత్వం, ఉపాధి అవకాశాలకు పునాది అవుతుంది. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ నివేదిక ఇప్పుడు ప్రభుత్వ ఫైళ్లలోనే పరిమితమైపోతే అది మరో కోల్పోయిన అవకాశంగా మిగిలిపోతుంది. ఆ నివేదికపై శాసనసభలో సమగ్ర చర్చ జరగాలి. అమలు చేయదగిన సిఫార్సులకు కాలపరిమితి నిర్ణయించాలి. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఖాళీల భర్తీ, బడ్జెట్ పెంపు, పాఠశాలల విస్తరణ, ఫీజుల నియంత్రణ, నాణ్యమైన బోధనకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది. ఆ వాస్తవాన్ని ప్రభుత్వం, ప్రతిపక్షాలు, సమాజం అందరూ గుర్తించినప్పుడే విద్య నిజంగా రాష్ట్ర అభివృద్ధి కేంద్రబిందువుగా మారుతుంది.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
ramkishore.1504@gmail.com

# తెలంగాణ పరిశోధనల సమగ్ర సమీక్ష



తెలంగాణ తెలుగు సాహిత్య పరిశోధన కాలానుగుణంగా విస్తరించి అనేక సాహిత్య ధోరణులు, భావజాలాలు, ఉద్యమాలు, రచయితల సృజనాత్మక ప్రపంచాలను అధ్యయనం చేసే సమగ్ర పరిశోధనా సంప్రదాయంగా అభివృద్ధి చెందింది. సాహిత్యం సమాజానికి ప్రతిబింబంగా నిలుస్తూనే సామాజిక మార్పు, చైతన్యం, అస్తిత్వ పోరాటాలు, మానవీయ విలువలు, రాజకీయ భావజాలాల వ్యక్తీకరణకు కూడా వేదికగా పనిచేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ తెలుగు సాహిత్యంలో ఏర్పడిన వివిధ సాహిత్య ధోరణులు, ఉద్యమాలు, అలాగే ప్రముఖ కవులు, రచయితల రచనల్లో ప్రతిఫలించిన భావజాలాలు పరిశోధకుల దృష్టిని విశేషంగా ఆకర్షించాయి.

భావకవిత్వం, జాతీయోద్యమ సాహిత్యం, సంస్కరణ కవిత్వం, అభ్యుదయ సాహిత్యం, దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం, మైనారిటీ వాద సాహిత్యం వంటి ప్రధాన సాహిత్య ధోరణులపై జరిగిన పరిశోధనలు తెలుగు సాహిత్య వికాస క్రమాన్ని వివిధ కోణాలలో విశ్లేషించాయి. అదే సమయంలో ఆధునిక కవిత్వం, ఉద్యమ గీతాలు, మార్క్సిస్టు భావజాలం, తిరుగుబాటు ధోరణులు, ప్రపంచీకరణ వ్యతిరేక చైతన్యం వంటి అంశాలపై జరిగిన అధ్యయనాలు సాహిత్యం మరియు సమాజం మధ్య ఉన్న సజీవ సంబంధాన్ని వెలుగులోకి తెచ్చాయి. అలాగే చెరబండ రాజు, గద్దర్, వరవరరావు, కాళోజీ, దాశరథి, సినారె, ఎన్. గోపి, నందిని సిధారెడ్డి, అంపశయ్య నవీన్, గోగు శ్యామల, జూలూరి గౌరీశంకర్, బోయ జంగయ్య, జాజుల గౌరి వంటి కవులు, రచయితల రచనలపై జరిగిన పరిశోధనలు మానవతావాదం, విప్లవ చైతన్యం, దళిత స్పృహ, స్త్రీవాద దృక్పథం, జాతీయ భావజాలం, తెలంగాణ అస్తిత్వ చైతన్యం, మనోవైజ్ఞానిక విశ్లేషణ, చైతన్యస్రవంతి శిల్పం వంటి విభిన్న అంశాలను కేంద్రీకరించాయి. ఈ పరిశోధనలు రచయితల సాహిత్య వ్యక్తిత్వాన్ని మాత్రమే కాకుండా వారి రచనల వెనుక ఉన్న సామాజిక, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యాలను కూడా స్పష్టంచేశాయి. ఈ వ్యాసము లో సాహిత్య ధోరణుల ఆధారంగా జరిగిన పరిశోధనలతో పాటు నిర్దిష్ట కవులు, రచయితల సాహిత్యంపై నిర్వహించిన అధ్యయనాలను సమగ్రంగా సమీక్షించడం ద్వారా తెలంగాణ తెలుగు సాహిత్య పరిశోధనలో రూపుదిద్దుకున్న ప్రధాన పరిశోధనా దిశలు, భావజాల పరిణామాలు, సామాజిక చైతన్య స్వరూపాలు, సాహిత్య వికాస క్రమం స్పష్టమవుతాయి. తద్వారా ఆధునిక తెలుగు సాహిత్య అధ్యయనంలో ఈ పరిశోధనల ప్రాధాన్యం, వాటి శాస్త్రీయ విలువ, భవిష్యత్ పరిశోధనలకు అవి అందించే మార్గదర్శకత్వం అవగతమవుతుంది.

**భావకవిత్వం, జాతీయోద్యమ సాహిత్యం, సంస్కరణ కవిత్వ పరిశోధనలు**

తెలుగు సాహిత్య పరిశోధనలో భావకవిత్వం, జాతీయోద్యమ సాహిత్యం, సంస్కరణ సాహిత్యం, నవ్యసాంప్రదాయ కవిత్వం వంటి అంశాలు విశేష ప్రాధాన్యాన్ని పొందాయి. ముఖ్యంగా 20వ శతాబ్దపు తెలుగు కవిత్వ వికాసాన్ని, జాతీయ చైతన్యాన్ని, సామాజిక సంస్కరణ భావాలను, కాల్పనికవాద ప్రభావాలను విశ్లేషించే పరిశోధనలు ఈ రంగంలో గణనీయంగా వెలువడ్డాయి. అవి భావకవిత్వం–డి. కామేశ్వర రావు, ఆధునికాంధ్ర భావకవిత్వం – ఎం.ఆన్సర్ (1936), ఆంధ్ర విశ్వ విద్యాలయం, భావకవిత్వంలో స్త్రీ (ఎం.ఫిల్. పరిశోధన) – పాటిబండ్ల మాధవశర్మ (1987), ఉస్మానియా విశ్వవిద్యాలయం, భావకవిత్వంలో స్త్రీ (ఎం.ఫిల్) – 1987–ఉస్మానియా యూనివర్సిటీ – ఎ. జయప్రభ, తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమం–సి. సిద్ధారెడ్డి (1990), నాగార్జున విశ్వవిద్యాలయం, స్వాతంత్య్ర ఉత్తర కాలాన అనంతర కాలాన తెలుగు కవిత్వం–ఎన్. భక్తవత్సలరెడ్డి (1979), మద్రాస్ విశ్వవిద్యాలయం, నవ్యసాంప్రదాయ కవిత్వం–జాతీయత (ఎం.ఫిల్. పరిశోధన)–కె.ఎస్. రాఘవాచారి, భావకవులపై కాల్పనిక సాహిత్యవాద ప్రభావం–కృష్ణమూర్తి. ఇవి భావకవిత్వంపై పాశ్చాత్య కాల్పనికవాద ప్రభావాన్ని పరిశీలించిన అధ్యయనం. ఆధునికాంధ్ర కవిత్వంలో సంస్కరణ కవిత్వం – డా. జనవాడ రామస్వామి (1997), ఉస్మానియా విశ్వవిద్యాలయం., తెలుగు, హిందీ సాహిత్యాలలో జాతీయోద్యమ గీతాలు – ఏనుగు నరసింహారెడ్డి (1998). ఇది తెలుగు, హిందీ భాషలలో జాతీయోద్యమ గేయాలను తులనాత్మకంగా పరిశీలించిన పరిశోధన. జాతీయోద్యమ నవలలు–పాత్రలు – వేల్చూరు నరసింహారావు. ఇది జాతీయోద్యమ నేపథ్యంలోని నవలలలో పాత్ర చిత్రణను విశ్లేషించిన అధ్యయనం. ఈ పరిశోధనలను పరిశీలిస్తే భావకవిత్వం, జాతీయోద్యమ సాహిత్యం, సంస్కరణ కవిత్వం, నవ్యసాంప్రదాయ కవిత్వం, తులనాత్మక సాహిత్య అధ్యయనాలు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం లభించినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా భావకవిత్వ స్వరూపం, జాతీయ చైతన్యం, సామాజిక సంస్కరణ భావాలు, కాల్పనికవాద ప్రభావాలు, జాతీయోద్యమ గేయాలు మరియు నవలలపై జరిగిన పరిశోధనలు ఆధునిక తెలుగు సాహిత్య పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి విలువైన ఆధారాలుగా నిలుస్తున్నాయి.

**అభ్యుదయ, దళిత సాహిత్య పరిశోధనలు :** తెలుగు సాహిత్య పరిశోధనలో అభ్యుదయ సాహిత్యం, దళిత సాహిత్యం, దళిత కవిత్వం, దళిత చైతన్యం, దళిత విమోచన భావజాలం వంటి అంశాలు ప్రత్యేక అధ్యయన రంగాలుగా రూపుదిద్దుకున్నాయి. సామాజిక అసమానతలు, వర్గ–కుల వివక్ష, అణగారిన వర్గాల జీవితానుభవాలు, సామాజిక న్యాయం, విముక్తి భావనలను కేంద్రంగా చేసుకొని అనేక పరిశోధనలు జరిగాయి. అభ్యుదయ సాహిత్యములో తెలంగాణ జీవన ప్రతిఫలనం–కందికట్ల వెంకటేశం, అభ్యుదయ కవిత్వంలో తెలంగాణ సమాజం, జీవన వాస్తవాల ప్రతిబింబాన్ని పరిశీలించిన అధ్యయనం, తెలుగు దళిత కవిత్వం – రూపం, వస్తువు – బి. మల్లికార్జున్ (1997), హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం, పంచమవేదం – దళిత చైతన్యం – కె. సుధాకర్. పంచమవేదం గ్రంథంలోని దళిత చైతన్యాన్ని విశ్లేషించిన పరిశోధన., తెలుగు సాహిత్యంలో హరిజన రచయితల సేవ – వై. విజయానందరాజు, హైదరాబాద్ కేంద్ర విశ్వ విద్యాలయం, తెలుగు కథానికలో దళిత పాత్ర చిత్రణ–జె. మురళీకృష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం., అంటరాని వసంతం–విమర్శనాత్మక పరిశీలన (ఎం.ఫిల్. పరిశోధన)–ఎ. సామన్య (2001), హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం., తెలుగు నవల–దళిత విమోచన దృక్పథం –ఎ. మల్లేశ్ (2025)., ఆధునిక సాహిత్యంలో దళిత స్పృహ –గోదారి నారాయణ (2000), ఉస్మానియా విశ్వవిద్యాలయం., శైలీశాస్త్రం–దళిత కవిత్వ పరిశీలన – డి.ప్రకాష్. దళిత కవిత్వాన్ని శైలీశాస్త్ర దృష్టితో అధ్యయనం చేసిన పరిశోధన. విప్లవ–దళిత సాహిత్య పరిణామాల్లో శివసాగర్ ప్రస్థానం గాదెం స్వరూపం (2022). శివసాగర్ రచనల ద్వారా విప్లవ, దళిత సాహిత్య ధోరణులను విశ్లేషించిన అధ్యయనం. తెలంగాణ దళిత రచయితల సాహిత్యం ఇరుగు మధుకర్ (2020)., తెలుగు దళిత కవిత్వం – సామాజిక జీవన చిత్రణ యాటెల్లి ఈశ్వర్., తెలంగాణ దళిత సాహిత్యంలో దళితేతర కవులు – సి. హెచ్. నరసింహులు. దళిత సాహిత్య వికాసంలో దళితేతర రచయితల పాత్రను పరిశీలించిన అధ్యయనం, నల్గొండ జిల్లా దళిత సాహిత్యం ఒక అధ్యయనంజి. కృపాకర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఈ పరిశోధనలను పరిశీలిస్తే దళిత కవిత్వం, దళిత చైతన్యం, దళిత పాత్ర చిత్రణ, దళిత విమోచన భావజాలం, హరిజన రచయితల సాహిత్య సేవ, తెలంగాణ దళిత రచయితల సాహిత్యం వంటి అంశాలపై విస్తృత పరిశోధనలు జరిగినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా దళిత కవిత్వ స్వరూపం, సామాజిక జీవన ప్రతిబింబం, దళిత స్పృహ, దళిత సాహిత్య ఉద్యమం, దళితేతర రచయితల పాత్ర వంటి అంశాలు పరిశోధకుల ఆసక్తిని ఎక్కువగా ఆకర్షించాయి. ఈ పరిశోధనలు తెలుగు సాహిత్యంలో దళిత చైతన్య వికాసాన్ని, సామాజిక న్యాయం కోసం సాగిన సాహిత్య పోరాటాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి.

**స్త్రీవాద సాహిత్య పరిశోధనలు :** తెలుగు సాహిత్యంలో స్త్రీవాద చైతన్యం 20వ శతాబ్దం ద్వితీయార్ధం నుంచి ప్రత్యేక సాహిత్య ధోరణిగా అభివృద్ధి చెందింది. స్త్రీ అస్తిత్వం, స్వేచ్ఛ, లింగ అసమానతలు, సామాజిక నిర్బంధాలు, స్త్రీ విముక్తి భావజాలం వంటి అంశాలను కేంద్రంగా చేసుకొని కవిత్వం, నవల, విమర్శా సాహిత్య రంగాలలో అనేక పరిశోధనలు వెలువడ్డాయి. ముఖ్యంగా స్త్రీవాద కవిత్వం, స్త్రీ విముక్తి ధోరణులు, ప్రముఖ మహిళా రచయిత్రుల సాహిత్యంపై గణనీయమైన పరిశోధనలు జరిగాయి. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ– పి. లక్ష్మి (1990), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ అనుభవాలు, భావజాలాన్ని పరిశీలించిన అధ్యయనం., ఆధునిక తెలుగు కవిత్వం -- స్త్రీ ఉదాత్త దర్శనం–ఎన్. సంధ్యారాణి, ఆధునిక కవిత్వంలో స్త్రీ స్వేచ్ఛ, సమానత్వ భావనల ప్రతిఫలనను విశ్లేషించిన పరిశోధన., ఈ దశాబ్ది నవలలలో స్త్రీ విముక్తి ధోరణులు–ఎన్. ఝాన్సీ రాణి, ఉస్మానియా విశ్వ విద్యాలయం., ఓల్గా నవలలు – స్త్రీవాద దృక్పథం – బి. భవాని (1992), హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం. ప్రముఖ రచయిత్రి ఓల్గా నవలలను స్త్రీవాద దృష్టితో విశ్లేషించిన అధ్యయనం., జయప్రభ కవిత్వం–స్త్రీవాద దృక్పథం (ఎం.ఫిల్. పరిశోధన)–జి. నిర్మల (2006), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. జయప్రభ కవిత్వంలోని స్త్రీవాద ఆలోచనలను పరిశీలించిన అధ్యయనం, నిషేధాక్షరి – స్త్రీవాద కవితా దృక్పథ విశ్లేషణ ఎం. నాగసురేష్ (2009), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం., కుప్పిలి పద్మ– స్త్రీవాద భావ విశ్లేషణ (ఎం.ఫిల్. పరిశోధన)–ఎ. కృష్ణవేణి (1998), శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం., తెలంగాణ స్త్రీవాద నవలలలో సామాజిక అవగాహన–జి. శ్యామల (1998), బనారస్ హిందూ విశ్వవిద్యాలయం., తెలంగాణ స్త్రీవాద నవలలలో ప్రతిఫలించిన సామాజిక చైతన్యాన్ని పరిశీలించిన అధ్యయనం. ఈ పరిశోధనలను పరిశీలిస్తే స్త్రీవాద కవిత్వం, స్త్రీ విముక్తి భావజాలం, స్త్రీ అస్తిత్వ చైతన్యం, మహిళా రచయిత్రుల సాహిత్యం, స్త్రీవాద నవలలు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం లభించినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ఓల్గా, జయప్రభ, కుప్పిలి పద్మ వంటి రచయిత్రుల సాహిత్యం, ఆధునిక తెలుగు కవిత్వంలోని స్త్రీ స్వరాలు, స్త్రీ విముక్తి ధోరణులు పరిశోధకుల ఆసక్తిని ఆకర్షించాయి. ఈ పరిశోధనలు తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఆలోచనల వికాసాన్ని, స్త్రీ అనుభవాల సాహిత్యీకరణను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి.

**మైనారిటీ వాద సాహిత్య పరిశోధనలు :** తెలుగు సాహిత్యంలో మైనారిటీ వాద సాహిత్యం ప్రత్యేక అధ్యయన రంగంగా ఇటీవలి కాలంలో మరింత ప్రాధాన్యం పొందింది. ముఖ్యంగా ముస్లిం సమాజ జీవనం, సాంస్కృతిక గుర్తింపు, సామాజిక వాస్తవికత, మైనారిటీ అనుభవాలు, ముస్లిం రచయితల సాహిత్య దృక్పథం వంటి అంశాలపై పరిశోధనలు వెలువడుతున్నాయి. ఈ అధ్యయనాలు తెలుగు సాహిత్యాన్ని మరింత బహుళ సాంస్కృతిక దృక్పథంతో అర్థం చేసుకోవడానికి దోహదపడుతున్నాయి. తెలుగులో ముస్లిం వాద సాహిత్యం–సామాజిక వాస్తవికత – షేక్ జావేద్ (2025), ముస్లిం వాద సాహిత్యంలో ప్రతిఫలించిన సామాజిక వాస్తవాలను విశ్లేషించిన అధ్యయనం., ముస్లిం మైనారిటీ కథలు–సాంస్కృతిక అంశాలు–ఎం.డి. నూర్జహాన్ (2025). ముస్లిం మైనారిటీ కథాసాహిత్యంలో కనిపించే సాంస్కృతిక విశిష్టతలను పరిశీలించిన పరిశోధన., తెలంగాణ ముస్లిం కవిత్వాలు–వస్తు, శిల్ప వైవిధ్యం–బషీర్ మొహమ్మద్ (2023). తెలంగాణ ముస్లిం కవిత్వంలోని ఇతివృత్త, శిల్ప పరమైన వైవిధ్యాన్ని అధ్యయనం చేసిన పరిశోధన, తెలుగులో ముస్లిం సాహిత్యం– సమగ్ర అధ్యయనం–ఎస్.కె. హుస్సేన్ (2023). ఈ పరిశోధనలను పరిశీలిస్తే ముస్లిం వాద సాహిత్యం, ముస్లిం మైనారిటీ కథలు, తెలంగాణ ముస్లిం కవిత్వం, ముస్లిం సాహిత్య సంప్రదాయం వంటి అంశాలపై అధ్యయనాలు జరిగినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ముస్లిం సమాజ జీవన వాస్తవాలు, సాంస్కృతిక గుర్తింపు, మైనారిటీ అనుభవాలు, తెలంగాణ ముస్లిం కవిత్వంలోని వస్తు–శిల్ప వైవిధ్యం వంటి అంశాలు పరిశోధకుల ఆసక్తిని ఆకర్షించాయి. ఈ పరిశోధనలు తెలుగు సాహిత్యంలో మైనారిటీ వాద దృక్పథాల వికాసాన్ని, ముస్లిం సమాజ సాహిత్య అనుభవాల ప్రతిఫలనను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధారాలు. **(తరువాయి భాగం రేపటి సంచికలో..)**

**డాక్టర్ ఐ చిదానందం**
**తెలుగు ఉపన్యాసకులు**
**వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ**
**నాగర్‌కర్నూల్, 8801444335**

## వరంగల్ భూపోరాటం

### పేదల గూడుపై 'కాంగ్రెస్' బుల్డోజర్ల దాడి..!

హనుమకొండ–వరంగల్ మహానగరంలో కాలే కడుపులు, కరిగే ఆశల మధ్య బతుకులీడుస్తున్న నిలువ నీడలేని నిరుపేదలపై కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ల రాజకీయాన్ని ప్రయోగిస్తోంది. ఇండ్ల కిరాయిలు కట్టలేక, రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద శ్రామికులు, రోజువారీ అడ్డకూలీలు తలదాచుకున్న గుడిసెలను తెల్లవారుజామున పోలీసుల నిర్బంధంలో, కనీస ముందస్తు హెచ్చరికలు లేకుండా కూల్చివేయడం అత్యంత అప్రజాస్వామికం, అమానుషం. గోపాలపురం చెరువు, గుండ్ల సింగారం పరిధిలో పేదలు వేసుకున్న ఇండ్లను కూల్చివేసిన తీరు ప్రజాస్వామ్య సమాజం తలదించుకునేలా చేసింది. నిత్యవసర సరుకులు, బట్టలు, పిల్లల స్టడీ సర్టిఫికెట్లు కూడా తెచ్చుకునే అవకాశం ఇవ్వకుండా పేదలను రోడ్డున పడేయడం ప్రభుత్వ కర్కశత్వానికి పరాకాష్ట. ఈ చర్యల వల్ల వందలాది కుటుంబాలు వీధిన పడి, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాయి.

ఇదే గోపాలపురం చెరువు, గుండ్ల సింగారం సర్వే నంబర్లలో ఇప్పటికే పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను, చెరువులను, కుంటలను ఆక్రమించి కోట్లు గడిస్తుంటే వారి జోలికి వెళ్లని యంత్రాంగం.. కేవలం 60 గజాల స్థలంలో తలదాచుకున్న పేదలపై ఏకపక్షంగా విరుచుకుపడటం వెనుక అంతరార్థం ఏమిటో పాలకులు సమాధానం చెప్పాలి. 'హయగ్రీవ చారి' లాంటి విలువైన భూములను ఆక్రమణదారుల కబంధహస్తాల నుండి రక్షించి, ప్రభుత్వానికి అప్పగించిన చరిత్ర ఎర్రజెండా పార్టీలది. భవిష్యత్తు తరాల కోసం భూములను కాపాడటం అంటే.. పేదల పొట్టకొట్టడం కాదు, భూ బకాసురుల గుండెల్లో నిద్రపోవడం అని పాలకులు గ్రహించాలి. మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కమిటీ వేసి 'ల్యాండ్ బ్యాంక్' ఏర్పాటు చేయడం వెనుక ఉన్న అసలు లక్ష్యం కార్పొరేషన్ అభివృద్ధి కాదు, పేదల భూములను లాక్కొని లేఅవుట్ల పేరుతో అమ్ముకోవడం లాంటి పరిస్థితే కనిపిస్తున్నది. వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకే సొంత భవనాలు లేక అద్దె కొంపల్లో నడుస్తుంటే, ఉన్న భూములను నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వకుండా అమ్ముకోవాలని చూడటం భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం చేకూరుస్తుంది. భూకబ్జాదారుల భూములను వెలికితీసేందుకు వామపక్షాలు సహకరిస్తామని చెబుతున్నా, ఆ పని చేయకుండా కేవలం పేదల ఇండ్లనే టార్గెట్ చేయడం దుర్మార్గం. రోజువారీ అడ్డ కూలీలు, ఇండ్లల్లో పని చేసేవారు మౌలిక వసతులు, కరెంటు, నీరు, రోడ్లు లేకపోయినా, విష పురుగుల నడుమ అత్యంత దుర్భర జీవితాన్ని ఈ గుడిసెలలో గడుపుతున్నారు. వీరికి జీవో 58 ప్రకారం పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న గూడును చెడగొట్టడం ప్రజా ప్రభుత్వ లక్షణం కాబోదు. ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు లేని పేదవాడు అంటూ ఉండడు అని చెబుతున్న పాలకులు, ఉన్న ఇల్లును నేలమట్టం చేయడం మే ఇందిరమ్మ రాజ్యమా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ క్రూరమైన ప్రభుత్వ విధానాలకు నిరసనగా వరంగల్–హనుమకొండ జిల్లా వామపక్ష పార్టీలు (సిపిఎం, సిపిఐ) ఉద్యమ శంఖారావాన్ని పూరించాయి. జూన్ 27న ఏకశిలా పార్కు నుండి జరగబోయే భారీ నిరసన ర్యాలీకి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ గారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ సాంబశివరావు గారు హాజరవుతున్నారు. అలాగే, జూన్ 1న జిల్లా కలెక్టరేట్ ధర్నాలు, జూలై 6న 'చలో హైదరాబాద్' కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇది కేవలం కొద్దిమంది పేదల కోసం కాదు, హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటం. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరి వీడి, పేదల గూడును కూల్చే ప్రయత్నాలను ఆపాలి. లేనిపక్షంలో ఎర్రజెండా ఆధ్వర్యంలో రేగబోయే ప్రజా ఆగ్రహానికి పాలకులు సమాధానం చెప్పుకోక తప్పదు. ఈ పోరాటంలో ప్రజాస్వామ్యవాదులు, బాధితులు, ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిన అవసరం ఉంది.



**బొట్ల చక్రపాణి**
**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**
**హనుమకొండ**
**9959779455**

# కాంగ్రెస్ ఓట్లను తొలగించే కుట్రలను అడ్డుకోవాలి

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జూన్ 24 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఓట్లను తొలగించే కుట్రలను సమర్థవంతంగా అడ్డుకోవాలని సంగారెడ్డి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని 282 మంది బీఎల్ఏలు, ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులతో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించి, ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు భరోసా కల్పించే బాధ్యత పార్టీ నాయకులదేనని అన్నారు. ఈ అంశంపై జూలై 6న మరోసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు మొత్తం నాలుగు సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి సమావేశానికి బీఎల్ఏలు, ఇన్‌చార్జ్‌లు,




గెలిచిన, ఓడిన సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. నియోజకవర్గంలోని 282 మంది బీఎల్ఏలు, ఇన్‌చార్జ్‌లు పూర్తిస్థాయిలో సమయం కేటాయించి పని చేయాలని కోరారు. వారికి అందజేసిన గుర్తింపు కార్డులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని, వారి పనితీరు ఆధారంగానే గుర్తింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఆందోళనలను ప్రస్తావించారు. కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల తొలగింపుతో బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయని ఆరోపించారు. పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ సూచనల మేరకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలో 543 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు 300కు పైగా సీట్లు వస్తేనే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని, ప్రస్తుతం ఆయన ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడుతున్నారని అన్నారు. మెదక్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, పార్లమెంట్ ఇన్‌చార్జ్ ప్రీతం, దయాకర్, తోపాజి అనంత కిషన్, జార్జ్, కూన సంతోష్, కిరణ్, కంది, సదాశివపేట, కొండాపూర్, సంగారెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించేందుకు భూ సేకరణ షురూ

- రైతులు భూములు ఇచ్చి సహకరించాలన్న ఎమ్మెల్యే శంకర్



**జిల్లేడు చౌదరిగూడ, జూన్ 24 (జనంసాక్షి) :** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించేందుకు రైతులు భూములు ఇవ్వాలని నాయకులు కోరారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ మండలంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించెందుకు భూసేకరణ మొదలు పెట్టాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, శంకరయ్య, కోరారు. బుధవారం నాడు లక్ష్మి దేవి పల్లి రిజర్వాయర్ స్థలం దగ్గర రిజర్వాయర్ కార్యాచరణ ప్రారంభించారు ఎమ్మెల్యే శంకరయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రిని ఒప్పించి రిజర్వాయర్ని తీసుకొస్తున్నాం ఈ రిజర్వాయర్ కింద భూములు పోయిన రైతులకు తగిన నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది అన్ని పార్టీల నాయకులు సహకరించి ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్. చెంద్ర రెడ్డి. వికారాబాద్ అడిషనల్ కనెక్టర్. జిల్లా సర్వేర్. ఆర్డీవో సరిత. ఏఈ లు, తాసిల్దార్ జగదీశ్వర్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, చలివేంద్ర పల్లి రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్. మార్కెట్ డైరెక్టర్ వెంకట నరసింహ రెడ్డి, సర్పంచ్ మోహనా చారి. నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే బలమైన విద్య

- ఎమ్మెల్యే సునీతారెడ్డి



శివ్వంపేట, జూన్ 24 (జనంసాక్షి) : ప్రీ ప్రైమరి విద్యతో భవిష్యత్తుకు విద్యార్థులకు బలమైన పునాది అవుతుందని స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శివ్వంపేట మండలంలోని నవాబ్ పేట, చిన్నగొట్టిముక్ల, ఉసిరికపల్లి, దొంతి గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరి పాఠశాలలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించడం జరుగుతుందని, విద్యార్థులు బాల్యం నుంచే మంచి విద్యను అభ్యసించాలన్నారు. చిన్నారులను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని సునీత గుర్తుచేశారు. అంతకుముందు ఆమె చిన్నారులకు అక్షరభ్యాసం చేయించి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఆత్మకమిటి మాజీ చైర్మన్ గొర్రె వెంకట్రెడ్డి, సర్పంచ్ లు తేజశ్విని రాజేందర్ నాయక్ , నారాయణరావు, మర్రి సుజాత కృష్ణారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ పాపయ్యాచారీ, నరేందర్, ఎంఈఓ బుచ్చానాయక్, ఎంపీఓ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిధులతోనే పాఠశాలల అభివృద్ధి

- ప్రైవేటుకు టుగా ప్రభుత్వ పాఠశాలలు
- అదనపు గదులను ప్రారంబించిన ఎంపీ.అరుణ

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 24 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని ప్రైవేటు కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని పాలమూరు పార్లమెంట్ సభ్యులు డీకే.అరుణ అన్నారు. బుధవారంనారాయణపేట జిల్లా, మండలంలోని కోటకొండ గ్రామంలో ఏ డబ్ల్యూ పి పీఎం శ్రీ పథకంలో భాగంగా 40.50 లక్షల నిధులతో నిర్మించిన పీఎం శ్రీ జిల్లా పరిషత్ హై స్కూల్ అదనపు తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్ లను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ అరుణ మాట్లాడుతూనారాయణపేట జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న పీఎం స్కూల్, మంచి ఫలితాలు సాధించిన పాఠశాల కోటకొండ పీఎం శ్రీ స్కూల్ అన్నారు.ప్రభుత్వ పాఠశా లలో అన్ని మౌలిక సదుపా యాలు ఉండాలని,ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. చదువులే గొప్ప ఆస్తి.చదువును ఎవరు లాక్కోలేరనీ అన్నారు.నేను దాన్వాడ ప్రభుత్వ పాఠశాలలోనే



చదువు మాకు అప్పట్లో ఇంతల మౌలిక సదుపాయాలు లేవు అన్నారు.ఉన్నత చదువులు చదువు చదివి ఉన్నత స్థానంలో ఉండాలనీ సూచించారు. ప్రతి ఒక్కరు చదువుకున్నప్పుడే కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులుపట్టుదలతో,శ్రద్ధగా చదివి లక్ష్యం నెరవేర్చుకోవాలనీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికా సిత్ భారత్ లక్ష్యంతో భారత్ అగ్రస్థానంలో ఉండాలని పని చేస్తున్నారు.దేశ భవిష్యత్ మీరే,అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి,పగుడాకుల శ్రీనివాసులు,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ వెంకట్రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**కేశంపేట, జూన్ 23 (జనం సాక్షి) :** ముదిరాజుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగళ్ళ రమేష్ అన్నారు. మండల పరిధిలోని పోమాల్ పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘ నూతన భవన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ నిదురం కృష్ణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులు ఆర్థికంగా రాణించేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. ముదిరాజులు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం చైర్మన్ లింగం, ఉపాధ్యక్షులు పోమాల్ పల్లి లింగం, సెక్రెటరీ శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రయ్య, పెద్ద లింగం, మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమ అభివృద్ధికి సమిష్టిగా అసోసియేషన్ పనిచేయాలి



**నిజాంపేట్, జూన్ 24 (జనం సాక్షి) :** సంక్షేమ సంఘాలు ప్రజల సంక్షేమం తో పాటు కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని – బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, ఎమ్మెల్యే కె. పి. వివేకానంద తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్‌ని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజల సంక్షేమం కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుంచల అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు టి. విక్రమ్, కోశాధికారి పి. సంపత్ రెడ్డి, కాలనీ ప్రముఖులు చింతకింది వెంకటేష్, మహిపాల్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వెంకటేష్ గౌడ్, రమేష్, సర్వన్, బ్రహ్మ, సుబ్బారావు, రాజేష్ కుమార్, సతీష్, టి. శ్రీనివాస్, అవినాష్, జి. రాజేందర్ రెడ్డి, సిహెచ్ అశోక్, ఎమ్. వేణుగోపాల్, షేక్ ముబిన్, టి. రవి కుమార్, ఫణీంద్ర, నవీన్, ఎన్. అవినాష్ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



**రామయంపేట, జూన్ 24 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా రామాయంపేట.నిజామాబాద్ నగరంలోని కపిల హోటల్ బ్యాంక్వెట్ హాల్‌లో మంగళవారం న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నియామక మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో ఎంపికైన వంద మందికి పైగా నూతన ప్రతినిధులకు నియామక పత్రాలు, అధికారిక ఐడీ కార్డులు అందజేసి శాలువాలతో సన్మానించారు. మెదక్ జిల్లా నిజాంపేట్ మండల ప్రెసిడెంట్ గా నార్లాపూర్ గ్రామానికి చెందిన బోయిని రమేష్‌ని, రామాయంపేట మండలం ప్రెసిడెంట్‌గా వెంకటాపూర్ గ్రామానికి చెందిన బండారి కిషన్, వైస్ ప్రెసిడెంట్‌గా అక్కన్నపేట గ్రామానికి చెందిన ఎల్లగారి రాజు, ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన మండల సభ్యునిగా మహమ్మద్ ఎండి షాదుల్, సుతార్ పల్లి గ్రామానికి చెందిన ఏలియాని మండల సభ్యునిగా నియమించడం జరిగింది. నూతన ప్రతినిధులు గ్రామ, మండల స్థాయిలో సామాన్య ప్రజలను చట్టంపై అవగాహన కల్పించి వారిని చైతన్యపరచడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు చాపల కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. సమాచార హక్కు చట్టం – 2005 ప్రజాస్వామ్యంలో పౌరులకు లభించిన శక్తివంతమైన ఆయుధమని, అవినీతిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. దరఖాస్తు విధానంపై వివరంగా వివరించారు. సభ నిర్వహణలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పుచ్చల నాగేష్ కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నయమొద్దీన్, ఉపాధ్యక్షులు కుడుముల వినోద్ కుమార్ తదితరులు పాల్గొని విద్యా హక్కు చట్టం, మానవ హక్కులు, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఒలింపిక్ డే రన్

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, జూన్ 24 (జనం సాక్షి) :** ఒలింపిక్ డే రన్ అనేది కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. ఒలంపిక్ డే ను పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మైదానంలో నిర్వహించిన 40వ అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై ఒలింపిక్ టార్చ్ వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని, క్రీడా రంగంలో మరింత మంది యువత రాణించాలని ఆకాంక్షించారు.అంబేద్కర్ మైదానం నుంచి ఐబీ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు హరికిషన్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జగన్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశం, జేశ్వంత్ గౌడ్, పీఈటీ సంఘం బాధ్యులు షర్ఫుద్దీన్, సుభాష్ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలి



**శామీర్‌పేట్, జూన్ 24 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పి రెండు సంవత్స రాలకు పైగా గడిచినప్పటికీ ఇప్పటివరకు సంక్షేమ పథకాలు అమలు కాక రైతులు మరియు ప్రజలు ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని మహిళ శక్తి మై వాయిస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హైమా రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మార్వో శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు.కేంద్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్నటువంటి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అందేలాగా తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. షామీర్ పేట్ పరిధిలో ఉన్నటువంటి పేదలందరికీ తక్షణమే సర్కార్ ఇస్తానన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయ్యాలని డిమాండ్ చేశారు. మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలందరికి ఉచితంగా మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు హైమారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలో ఎన్.హైమారెడ్డి వ్యవస్థాపక అధ్యక్షురాలు మహిళా శక్తి మై వాయిస్ సంఘం, అంబటి రమేష్ మహిళా శక్తి మై వాయిస్ సంఘం ట్రెజరర్, అలియాబాద్ మున్సిపాలిటీ బిజెపి జనరల్ సెక్రెటరీ మహేష్ , బిజెపి నాయకులు ఆంజనేయులు ముదిరాజ్ , శ్రీనివాస్ , సత్య నారాయణ,సాయిబాబా, హారతి పాల్గొన్నారు.

## పోలీసు శాఖలో సాంకేతిక వినియోగం పెంచాలి

- డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 24 (జనం సాక్షి) :** వార్షిక తనిఖీలలో భాగంగా ఉప మహా పరిశీలకుడు ఎల్.ఎస్. చౌహాన్ జహీరాబాద్ ఉపవిభాగ కార్యాలయం, జోగిపేట వలయ కార్యాలయం, పుల్కల్ పోలీసు స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమీక్షించారు. నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని, ప్రజల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణా నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమాజంలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మోసాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ వెంట జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య, వైద్యంతోనే రాష్ట్రాభివృద్ధి

**మొయినాబాద్, జూన్ 24 (జనం సాక్షి) :** విద్య, వైద్యంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నాణ్యమైన విద్య అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించి గ్రామంలో పలు సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ప్రభుత్వం ద్వారా హెచ్ఎండిఏ నిధులు దాదాపు 50 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ విద్య, వైద్యంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా మౌలిక వసతులు, యూనిఫామ్, నోటు బుక్స్, అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో పాటు పాఠశాలల మెరుగుపరచడంలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా తల్లిదండ్రులు కూడా పిల్లల విద్య కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి మండల అభివృద్ధి అధికారి హిమబిందు, అమ్డాపూర్ సర్పంచ్ మద్యపాక కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు విక్రమ్రెడ్డి, గీత, వనజాక్షి, లక్ష్మి వెంకట్రెడ్డి, మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షులు వడ్ల నర్సింహ్మాచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకఅరుణ్కుమార్ గౌడ్, అశోకాయాదవ్,



మన్నె ప్రభాకర్ రెడ్డి, రక్తమైసమ్మ దేవాలయ చైర్మన్ గుంటం నర్సింహ్మారెడ్డి, ఉపసర్పంచ్ జితేందర్రెడ్డి, మాడి విక్రమ్రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేష్, సామ కృష్ణారెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
25 జూన్ 2026

# మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి

- డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- సంచార కేంద్రం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

**గద్వాల నడిగడ్డ, జూన్ 24 (జనం సాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బుధవారం గట్టు మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం వద్ద మహిళా సంచార కేంద్రం ప్రారంభోత్స కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గట్టు మండలంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాలుగు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఒక ఆటో, సైకిల్ ను కొనుగోలు చేసి డ్రైవింగ్ లో కిశోర బాలికలు, మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించి, సహకరించాలని కోరారు. మహిళా సమాఖ్య తరపున ఈ వాహనాలను అద్దెకు ఇచ్చి కూడా సభ్యులు ఆదాయం పొందవచ్చన్నారు.మహిళా సంఘాలు ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు,తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తెలంగాణ ఇంక్లూజివ్




లైవ్లీహుడ్ ప్రోగ్రాంకు జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంను ఎంపిక చేసినందున ఇక్కడి 14 గ్రామాల్లో 1033 కుటుంబాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే కాక ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మోవో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు గట్టు మండలంలో వలసలు ఎక్కువగా ఉండేవని, ప్రజలు పేదరికంతో ఇబ్బంది పడే వారని, ప్రస్తుతం ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గట్టు ప్రాంత మహిళల సంక్షేమం, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం మహిళా మొబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, గట్టు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే వాహనాలను ప్రారంభించి,ఆటోలో కాసేపు ప్రయాణించారు.

### స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలో అసంపూర్తిగా నిర్మించబడ్డ స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. అలాగే పలువురు విద్యార్థులు చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గట్టులోని జడ్పీహెచ్ఎస్ ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గట్టు సర్పంచ్ నాగరాజు, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సీఈఓ జయ భారతి, తహసిల్దారు విజయ్ కుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటేశ్వరి, ఏపీడి శ్రీనివాస్,డిపిఎం సలోమి, శిక్షకురాలు నందిని, ఇతర అధికారులు, నేతలు, మహిళా సంఘాల సభ్యులు, కిశోర బాలికలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్



**నర్సాపూర్, జూన్ 24 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ అన్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలపై పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం గురించి ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ కౌన్సిలర్లు నరసమ్మ, (రవి) సుధీర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

- సిడిసి చైర్మన్ గడిల రామ్‌రెడ్డి



**సదాశివపేట, జూన్ 24 (జనంసాక్షి) :** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వమే సాకారం చేస్తోందని సీడీసీ చైర్మన్ గడిల రామ్‌రెడ్డి అన్నారు. సదాశివపేట మండలంలోని ఇశ్రితాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ బలరాం అనిత శ్రీనివాస్, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గడిల రామ్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం గృహ వసతి కల్పిస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్, ఆయా గ్రామాల సర్పంచులు ,మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కట్టె గోశే శ్రీనివాస్, వార్డు మెంబర్లు,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యం

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి రూరల్, జూన్ 24 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి విజయవంతం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ భవిష్యత్తుకు కీలకమని, ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏజెంట్లకు సోదాహరణంగా అవగాహన కల్పించారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందన్నారు. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా వ్యవహరించి అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల ప్రభావం, అనర్హ ఓటర్ల నమోదును నిరోధించడంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకమని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు కేవలం ఓటర్ల నమోదు, సవరణలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలోని 316 బూత్‌లను నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పర్యవేక్షించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ బలమైన ప్రజా మద్దతుతో ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర సాధన నుంచి అభివృద్ధి వరకు కేసీఆర్ నాయకత్వం తెలంగాణకు దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. ఓటు ప్రతి పౌరుడి వజ్రాయుధమని, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చడం, వారి హక్కులను కాపాడడం బూత్ లెవల్ ఏజెంట్ల ప్రధాన బాధ్యత అని అన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 25 వరకు విచారణ ప్రక్రియ కొనసాగుతుందని, అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా విడుదల కానుందని వివరించారు. ఈ ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించాలని




పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, బి. లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, కర్రె స్వామి, వనం రాములు, దిలీప్ రెడ్డి, కె. మాణిక్యం, బి. బాలరాజు, వేణు యాదవ్, రాళ్ల కృష్ణయ్య, శివరామ్ రెడ్డి, వెంకట్ స్వామి, గంధం పరంజ్యోతి, ఆవుల రమేష్, పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్, ఎద్దుల సాయికుమార్, వెంకట్ సాగర్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, మతీన్, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, హేమంత్ ముదిరాజ్, వడ్డే రమేష్, మహేశ్వర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణలో ప్రజలు సహకరించాలి

- ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణకార్యక్రమాన్ని విజయవంతంచేయాలి
- కల్వకుర్తిఆర్డీఓ జనార్దన్ రెడ్డి

**కల్వకుర్తి, జూన్ 24 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోజూన్ 25,2026 నుండి ప్రారంభం కానున్న స్పెషల్ఇంటెన్సివ్రివిజన్(ఎస్ఐఆర్)కార్యక్రమాన్నివిజయవంతంచేయడం జరిగిందనికల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి తెలిపారు.బుధవారం కల్వకుర్తి పట్టణ తహసీల్దార్(ఎమ్మార్వో)ఇబ్రహీం ఆధ్వర్యంలో ఎస్ఐఆర్-2026 కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు. ఎమ్మార్వో కార్యాలయం నుండి హైదరాబాదు చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో అధికారులు,విద్యార్థులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరు జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రజలు తమపూర్తి వివరాలను అందించిఫారాలను సక్రమంగానింపాలని సూచించారు.ఫారంలో ప్రస్తుత ఫోటో, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామి వివరాలను




నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే 2022 స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో ఉన్న తల్లిదండ్రులు లేదా తాతమ్మల వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. "మీ ఓటు మీ బాధ్యత. ప్రతి ఓటరుతమవివరాలను ఓటరు జాబితాలో నవీకరించుకోవాలిని బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు వారికి పూర్తి సహకారం అందించాలిఅని ఆర్డీఓ జనార్దన్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలోకల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం,మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్,ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి,సీఐ భీమ్ కుమార్,ఎంఈఓ శంకర్ నాయక్,సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, వ్యవసాయ శాఖ ఏవో, స్పెషల్ ఆఫీసర్ సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు, ఎంజేపీ బీసీ గురుకుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

- కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై గర్జన!
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర విద్యా శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి
- పీసీసీ ఆదేశాల మేరకు డిసిసి జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన ర్యాలీ

**జోగులాంబ గద్వాల జిల్లా, జూన్ 24 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ విద్యా విధానం మరియు పరీక్షల నిర్వాహణలో నిర్లక్ష్యంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల అవకతవకలు మరియు భారీ ఫీజులతో విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆరోపిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు చేపట్టింది. గద్వాల జిల్లా కేంద్రంలోని విద్యా వ్యవస్థ పై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి పై నిరసన ర్యాలీ జిల్లా డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ పాత బస్టాండ్ నుండి కృష్ణవేణి చౌక్ వరకు పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.జిల్లా డిసిసి అధ్యక్షుడు కేంద్ర ప్రభుత్వం అసమార్థ పాలన వలన విద్యా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరికి పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమారుతో నీటు పరీక్ష పేపర్ లీకులు చేయడంతో ఎంతోమంది జీవితాల నాశనం కావడం జరుగుతుంది. కాబట్టి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు.లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభించిన ' ఛాత్రోంకి గుంజ్ ' (విద్యార్థి యువత గొంతుక) మహా ఉద్యమానికి గద్వాల్ డిసిసి మద్దతు నిస్తుందన్నారు నీట్




పరీక్షల రద్దు, ప్రశ్నపత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలలో జాప్యము పెరుగుతున్న నిరుద్యోగం యువతను ఆందోళన గురి చేస్తుందని పేర్కొన్నారు.విద్యాశాఖ మంత్రి ఏ ముఖం పెట్టుకొని ఇంకా పదవిలో కొనసాగుతున్నారు అర్థం కావడం లేదు విద్యార్థుల శాపం కచ్చితంగా తగలకనే తగులుతుందన్నారు,దేశవ్యాప్తంగా 23 లక్షల మంది నీట్ ఎగ్జాం రాస్తే ఈ డబల్ ఇంజన్ సర్కార్ వారిపై పెట్రోల్ పోసి తగల పెట్టినంత పని చేసిందని,వారు అధికారంలో ఉన్న ప్రధాన రాష్ట్రాలు అయినటువంటి మహారాష్ట్ర మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో ఎగ్జామ్ 42 గంటల ముందే నీట్ ఎగ్జాం పేపర్ లీక్ చేసిన చరిత్ర ఈ డబల్ ఇంజన్ సర్కార్ దని, నిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలో నెట్టడంలో బీజేపీ ని మించిన పార్టీ ఇంకొకటి లేదని,విద్యార్థుల జీవితాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ హనుమంతు, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు, కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్స్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో డ్రగ్స్ పట్ల అవగాహన పెంపొందించాలి

- ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్



**ఉప్పునుంతల, జూన్ 24 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని మైల్ స్టోన్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యాభ్యాసంపై దృష్టి సారించాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రూప్‌సింగ్, ఇతర పోలీసు సిబ్బంది, మైల్ స్టోన్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉన్ని కృష్ణన్, సిబ్బంది దేవేందర్ రెడ్డి,ఏడుకొండలు విద్యార్థి విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యాయం అందించాలి

- జిల్లా ఎస్పీ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 24 (జనం సాక్షి) :** సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో భరోసా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎస్పి పాల్గొని మాట్లాడారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింస, వేధింపులు, లైంగిక దాడులు మరియు ఇతర నేరాల బాధితులకు తక్షణ సహాయం, రక్షణ, పునరావాసం, కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.బాధిత మహిళలు, చిన్నారులకు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయడం సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, బాధితులకు సమగ్ర సేవలు అందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.బాధిత మహిళలకు చిన్నారులకు తక్షణ సహాయం చేయడంలో సంబంధిత శాఖలకు ఎలాంటి సమస్యలు వస్తున్నాయా అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. భరోసా సెంటర్ కి వచ్చిన బాధితులకు మెడికల్, లీగల్, సిడబ్ల్యూసి అధికారుల దగ్గర కు పంపించకుండా వారి వద్దకే అందరూ వచ్చి న్యాయం చేసే విధంగా చూడాలని తెలిపారు.అలాగే వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రతి నెల రివ్యూ మీటింగ్ నిర్వహించి ఆ నెలలో ఎంతమంది బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి,వారికి అందించే ప్రభుత్వ పరిహారం తదితర విషయాలు గురించి చర్చించాలని తెలిపారు.దర్యాప్తు ప్రక్రియలో పోలీసు శాఖతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా న్యాయ సేవల సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్, కౌన్సిలర్లు, ఇతర భాగస్వామ్య సంస్థలు సమిష్టిగా పనిచేస్తే బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని పేర్కొన్నారు. బాధితుల కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన కేసుల్లో అత్యంత సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. బాధితుల పునరావాసం, విద్య, వైద్య సహాయం, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భరోసా కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు బాధితులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయగల వాతావరణాన్ని కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా



ప్రజలకు ముందస్తు అవగాహన చేయాలని అలాగే సమాచారం అందితే వెంటనే సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, సీఐ లు శివ శంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి ,విక్రం, నరేష్, రమేష్, శిరీష, సునీత, మహేశ్వరి, గాయత్రి, డి ఎం ఎచ్ ఓ జయ చంద్ర మోహన్, రాజేందర్ గౌడ్,చైర్మన్ అశోక్ శ్యామల,సి ఐ లు భగవంత్ రెడ్డి, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, భరోసా సెంటర్ సిబ్బంది, దర్యాప్తు అధికారులు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రాయపర్తి మండలంలో కలెక్టర్ పర్యటన



**రాయపర్తి,జూన్ 24 (జనంసాక్షి):** రాయపర్తి మండలంలోని తెట్టకుండా తండా గ్రామంలోని అంగన్వాడి కేంద్రం,పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన,పోషకాహార కార్యక్రమాలు, మౌలిక వసతులను పరిశీలించారు. పిల్లల హాజరు,విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలు,పాఠశాలల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు,ఆర్డీవో సుమ,రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రాయపర్తి మండలంలోని గన్నారం, కాట్రపల్లి గ్రామాలలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల నిర్మాణ స్థితి,మౌలిక వసతులు,లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి జెడ్పీ సీఈవో రాంరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హుల జాబితాను రూపొందించి,నిజమైన నిరుపేదల కు గృహాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక లో ఎలాంటి వివక్షకు తావు లేకుండా వ్యవహ రించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో సుమ,రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్లేస్‌మెంట్లలో వరంగల్ ఎన్ఐటీ విద్యార్థుల ఎంపిక

- ఆరుగురు విద్యార్థులకు 70 లక్షలకుపైగా వార్షిక వేతన ఆఫర్లు
- 27 మంది విద్యార్థులకు 50 లక్షల పైగా వార్షిక వేతన ఆఫర్లు
- 130 మంది విద్యార్థులకు పైగా 30 లక్షల వార్షిక వేతన ఆఫర్లు
- విద్యార్థులను అభినందించిన నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి



**వరంగల్ బ్యూరో, జూన్ 24 (జనం సాక్షి) :** దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్ విద్యాసంస్థలలో ఒకటైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్, ప్రస్తుత సవాళ్లతో కూడిన ఉద్యోగ మార్కెట్ పరిస్థితుల మధ్య 2025–26 ప్లేస్‌మెంట్ సీజన్‌లో విశేష విజయాన్ని సాధించి మరోసారి తన ప్రతిభను చాటుకుంది. అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) విద్యార్థుల ప్లేస్‌మెంట్‌లలో సంస్థ అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసింది. అర్హత కలిగిన 704 మంది యూజీ విద్యార్థులలో 660 మందికి పైగా ఉద్యోగాలు లభించగా, 93.75 శాతం ప్లేస్‌మెంట్ రేటు నమోదైంది. పీజీ స్థాయిలో 860 మంది అర్హులైన విద్యార్థులలో 677 మంది ఉద్యోగాలు సాధించి 78.72 శాతం ప్లేస్‌మెంట్ రేటును నమోదు చేశారు( ప్రస్తుతం కొంతమంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు కొనసాగిస్తూ పూర్తి స్థాయి ఉద్యోగ ఆఫర్ల కోసం ఎదురుచూస్తున్నారు). ఆఫ్–క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లు మరియు ఉన్నత విద్యలో చేరిన విద్యార్థులను పరిగణనలోకి తీసుకుంటే, యూజీ ప్లేస్‌మెంట్ రేటు 95 శాతం, పీజీ ప్లేస్‌మెంట్ రేటు 80 శాతానికి మించి ఉండే అవకాశం ఉంది. ఈ ప్లేస్‌మెంట్ సీజన్‌లో ఎన్ఐటీ వరంగల్ చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. దేశీయంగా అత్యధిక వార్షిక వేతన ప్యాకేజీ రూ.1.27 కోట్లకు చేరుకోగా, రూ.70 లక్షల కంటే అధిక విలువ కలిగిన అనేక ఆఫర్లు విద్యార్థులకు లభించాయి. యూజీ విద్యార్థులకు సగటు సీటీసీ రూ.18.54 లక్షలు, మధ్యస్థ (మీడియన్) సీటీసీ రూ.15 లక్షలు నమోదయ్యాయి. పీజీ విద్యార్థులకు సగటు సీటీసీ రూ.12.13 లక్షలు, మీడియన్ సీటీసీ రూ.9 లక్షలుగా నమోదయ్యాయి. ముఖ్యంగా దాదాపు అన్ని యూజీ విభాగాలు గత సంవత్సరంతో పోలిస్తే అధిక ప్లేస్‌మెంట్ శాతాలను నమోదు చేయడం విశేషం. 2025–26 ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 360కి పైగా ప్రముఖ సంస్థలు పాల్గొనడం విశేషం. ఇది గత సంవత్సరాలతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల కాగా, ఎన్ఐటీ వరంగల్ విద్యార్థుల ప్రతిభపై పరిశ్రమల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది.

6 మంది విద్యార్థులు రూ.70 లక్షలకు పైగా వార్షిక వేతన ఆఫర్లను పొందారు. 27 మంది విద్యార్థులు రూ.50 లక్షలకు పైగా ప్యాకేజీలను సాధించారు. 130 మందికి పైగా విద్యార్థులు రూ.30 లక్షలకు పైగా వార్షిక వేతన ఆఫర్లు పొందగా, 720 మందికి పైగా విద్యార్థులు రూ.10 లక్షలకు మించిన ప్యాకేజీలను సాధించారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (410 ఆఫర్లు), కోర్ ఇంజినీరింగ్ (480 ఆఫర్లు), అనలిటిక్స్ (230 ఆఫర్లు)తోపాటు ఇతర రంగాల్లోనూ గణనీయ మైన ఉద్యోగ అవకాశాలు లభించాయి. గత మూడు సంవత్సరాల ప్లేస్‌మెంట్ గణాంకాలు కూడా ఎన్ఐటీ వరంగల్ పురోగతిని స్పష్టంగా చూపిస్తున్నాయి. 2024లో 305 సంస్థలు పాల్గొనగా, 2026 నాటికి ఈ సంఖ్య 360కు పైగా పెరిగింది. యూజీ ప్లేస్‌మెంట్ శాతం 83 శాతం నుంచి 93.75 శాతానికి పెరగడం విశేషం. ఈ విజయంపై స్పందించిన ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి విద్యార్థులు మరియు అధ్యాపకులను అభినందించారు. విద్యార్థులకు నిరంతరం సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ అందిస్తూ వారి కెరీర్ అభివృద్ధికి కృషి చేస్తున్న సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీసీపీడీ) బృందాన్ని, దాని అధిపతి ప్రొఫెసర్ పి.వి. సురేష్ నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు. ఈ ప్లేస్‌మెంట్ విజయం సంస్థలోని విద్యా నాణ్యత, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి మరియు సమిష్టి కృషికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సంస్థ డీన్లు, విభాగాధిపతులు, రిజిస్ట్రార్ విద్యార్థులతో పాటు సీసీపీడీ బృందానికి అభినందనలు తెలియజేశారు.

# పరకాల ఎమ్మెల్యేకు పర్సంటేజ్ లేనిది పనులు లేవు

- పదేళ్ల అభివృద్ధి పనుల పై బహిరంగ చర్చకు సిద్ధమా?
- ఎమ్మెల్యేకు సవాల్ విసిరిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు
- నడికుడలో ఎమ్మెల్యే రేవూరి దిష్టిబొమ్మ దగ్ధం



**నడికూడ, జూన్ 24 (జనం సాక్షి) :** నడికుడ మండల కేంద్రంలో బుధవారం పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలోశాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పై, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నడికుడ మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేడిపల్లి శోభన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి పై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పరకాల నియోజకవర్గం లో 2000 మంది మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ మరియు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమం మహిళలకు స్వయం ఉపాధి కల్పన దిశగా ఏర్పాటు చేసిన ఒక మంచి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా కూడా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధుల తో ఇప్పటికే దాదాపుగా 5000 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు ఇచ్చి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. పరకాల మండలం నాగారం గ్రామంలో గ్రామ పంచాయతీలో కుట్టు మిషన్ కార్యక్రమాన్ని ఉద్దేశించిస్థానిక ఎమ్మెల్యే రేవురి ప్రకాష్ రెడ్డి రాజకీయ కార్యక్రమం అని మాట్లాడడం బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం అని అని తప్పుడు మాటలు మాట్లాడారని, నాగారం గ్రామంలో జరిగిన కుట్టుమిషన్ కార్యక్రమానికి గ్రామంలో ఉన్న అన్ని పార్టీల మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు గడచిన రెండున్నర సంవత్సరాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రేవురు ప్రకాష్ రెడ్డి ని పల్లెత్తు మాట కూడా అనలేదన్నారు నడికూడ మండల మాజీ వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా చేశానని అన్నారు కానీ ఏమాత్రం అనుభవం లేకుండా మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు మండల బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గణపతి రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేకు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికి ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు అన్నారు కొంతమంది కాంగ్రెస్ చిల్లర నాయకులకు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని విమర్శించే అర్హత లేదన్నారు త్వరలోనే బిఆర్ఎస్ సైన్యం తగిన బుద్ధి చెప్తుందన్నారుఈ కార్యక్రమంలో నడికూడ మండల బిఆర్ఎస్ నాయకులు భీము ని నాగిరెడ్డి మాజీ జెడ్పిటిసి కోడేపాక సుమలత -కరుణాకర్ మాజీ ఎంపీపీ మచ్చ రవి అన సూర్య, వరికోల్ సర్పంచ్ లు దొగ్గేలా కుమార స్వామి, మేకల వెంకటేష్ కోడెపాక ముత్యాలు ఐలయ్య, నడికుడ మాజీ సర్పంచ్ రావుల పద్మ ఉప సర్పంచ్‌లు మురాల భుజంగరావు, యరా ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దైవభక్తి కన్నా దేశభక్తి గొప్పది

- సద్గురు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ గోపీచంద్
- 31 నిరుపేద జంటలకు సామూహిక వివాహ మహోత్సవం
- సత్యనారాయణ స్వామి వ్రతం, హోమం, అన్నదాన కార్యక్రమం



**వరంగల్ బ్యూరో, జూన్ 24 (జనం సాక్షి) :** సద్గురు శ్రీశ్రీశ్రీ శివానందమూర్తి చెప్పిన విధంగా దైవభక్తి కన్నా దేశభక్తి గొప్పదని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్, మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. బుధవారం ములుగు రోడ్డు లోని సప్త ధామంలో అత్యంత నిరుపేదలైన 31 మంది జంటల గిరి పుత్రులు పుత్రికలకు సామూహిక వివాహ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా హోమం సీతారాముల కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిచంద్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి 19 మంది జంటలు, కొత్తగూడ నుండి ఏడుగురు జంటలు, స్థానికంగా ఐదుగురి జంటలకు సామూహిక వివాహాలను మొదటిసారిగా సప్త ధామం సన్నిధిలో నిర్వహించినట్లు చెప్పారు. వివాహాలు చేసుకునే జంటలకు కుటుంబ సభ్యులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా తాము పెళ్ళికి కావలసినటువంటి పుస్తెలు, మట్టెలు, బట్టలు, కావలసిన అన్ని రకాల వస్తువులను అందించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎక్కడో 300 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి పేద వివాహ జంటలను తమ వాహనాల్లో తీసుకొచ్చి కావలసిన అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. శివానంద గురు ట్రష్టి బండారు సాయి నారాయణ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 31 మంది జంటలకు పెళ్లిళ్లు జరిపించడం ఒక అద్భుతం అని అన్నారు. వివాహం అనంతరం వారికి వారి కుటుంబ సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతినిత్యం సప్తధామంలో ఎన్నో రకాల పూజలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సద్గురువు శ్రీశ్రీశ్రీ శివానందమూర్తి దివ్య ఆశీస్సులు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివాహాలు జరుపుకున్నటువంటి జంటలు తాము చాలా సంతోషంగా ఉన్నామని, తమ తల్లిదండ్రుల కంటే ఎక్కువ ప్రేమతో ఆప్యాయతతో వివాహాలు జరిపించి తమను ఆశీర్వదించిన శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అందరి సహకారం అవసరం

- ఎస్ఐఆర్-2026 విజయవంతానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి
- డబుల్ ఓట్లపై చట్టపరమైన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 24 (జనం సాక్షి) :** ఓటరు జాబితాను మరింత ప్రామాణికంగా, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమానికి ప్రజలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా సహకరించాలని హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐఆర్–2026 అమలు విధానం, ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఓటర్ల బాధ్యతలపై సమగ్ర వివరణ అందించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారం పూరించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సరైన సమాచారం చేరవేసే విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఎస్ఐఆర్‌పై అపోహలు, అనుమానాలు తొలగించి అవగాహన పెంపొందించడంలో మీడియా సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఓటరూ ఈ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు, 1800 425 1126 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ ఐ ఆర్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ఎస్ఐఆర్–2026 విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్ఓ కె. శ్రీనివాస్, డీపీఆర్ఓ అయూబ్ అలీ,ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# డీసీసీ చేతుల మీదుగా బహుమతి అందుకున్న ఐలోని విశిష్ట

**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 24 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసుల ఆధ్వర్యం లో ఆంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. సెయింట్ మేరీ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న మండలం లోని తాటికొండ గ్రామానికి చెందిన ఐలోని స్వప్న–లింగమూర్తి దంపతులకు కూతురు ఐలోని విశిష్ట డ్రాయింగ్ పోటీలలో ప్రథమ బహు మతి అందుకున్నారు. ఈ బహుమతి జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, స్టేషన్ ఘన్పూర్ ఏసిపి భీమ్ శర్మ చేతుల మీదుగా ఐలోని విశిష్టకు ప్రథమ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ ఘన్పూర్ సీఐ జి వేణు, ఎస్ఐ పిట్ట రాజేష్,ఎస్ఐ మనీషా,పోలీస్ సిబ్బంది, ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు. డ్రాయింగ్ పోటీలలో ప్రథమ బహుమతి అందుకున్న ఐలోని విశిష్టను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- ప్రతి అర్హుడైన ఓటరికి సమాచారం అందేలా అవగాహన కల్పించాలి
- గ్రామీణ,గిరిజన,మారుమూల ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 24 (జనం సాక్షి):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2026 (ఎస్ఐఆర్) పై జిల్లాలో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబధిత ఆదేశించారు. బుధవారం జిల్లా ఎన్నిక అధికారి,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2026 పై విస్తృత అవగాహన కల్పించడం పై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అందిన ఆడియో, వీడియో ప్రచార సామగ్రిని అన్ని కమ్యూనికేషన్ మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రచారం ద్వారా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అర్హత లేని పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ప్రతి అర్హుడైన ఓటరికి సమాచారం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి,ఆర్డీఓ కృష్ణ వేణి, తహసీల్దార్లు,ఎలక్షన్ సెల్ అధికారులు, సంబధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పోలీసుల అవగాహన సదస్సు
- వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు




**గోవిందరావుపేట, జూన్ 24 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం. అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న "డ్రగ్ అవేర్‌నెస్ వీక్–2026"లో భాగంగా గోవిందరావుపేట మండలంలోని పసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రవీందర్ సూచనలతో, సీఐ దయాకర్ పర్యవేక్షణలో, పసర ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేకంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అధికారులు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు 1908. టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే స్థానిక పోలీసులకు కాల్ లేదా సందేశం ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యతగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్వాయి జిల్లా పరిషత్ పాఠశాల హెడ్మాస్టర్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు వాసుదేవ్ రెడ్డి, అన్నపూర్ణ, చల్వాయి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, యాంటీ డ్రగ్స్ కోఆర్డినేటర్ ఎస్ భవాని, ప్రాజెక్ట్ నగర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల వార్డెన్ ప్రశాంత్, ఏఎన్ఎం ప్రవళిక, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
25 జూన్ 2026

# పారదర్శక ఓటరు జాబితాను రూపొందించేందుకు సహకరించాలి

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి) :** అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా పారదర్శక ఓటరు జాబితాను రూపొందించేందుకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.బుధవారం సర్ పై కలెక్టరేట్ లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నేటి నుండి జూలై 24 వరకు బిఎల్ఓలు ఇంటింటిని సందర్శిస్తున్నారని తెలిపారు.ఇందులో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వడం జరుగుతుందని, ఈ కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.ఈ విషయంలో బిఎల్ఓలకు బిఎల్ఏలు పూర్తి సహకారం అందించాలని చెప్పారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నేటి నుండి జూలై 24 వరకు బిఎల్ఓల ఇంటింటి సందర్శన, జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు ముసాయిదా




ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని తెలిపారు.తుది ఓటరు జాబితాను 2026 అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు వెల్లడించారు.బిఎల్ఓలు ఇంటింటి సందర్శన సందర్భంగా ప్రతి ఓటర్ కు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వడం జరుగుతుందని, ఒకటి బిఎల్ఓ దగ్గర ఉంటుందని, మరొకటి ఓటర్ కు ఇస్తారని, ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్యూమరేషన్ ఫామ్ లో వివరాలను ఇవ్వలేకపోతే ఓటర్ పోర్టల్ ద్వారా కూడా వివరాలను సమర్పించవచ్చని వెల్లడించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం తీసుకో లేకపోయినా, లేదా సమర్పించలేకపోయినా పొరపాటున లెక్కించకపోయిన, లేదా జాబితాలోకి రాకపోయినా గుర్తించి వారు జాబితాలో నమోదయ్యేలా సహకరించాలని కోరారు.ప్రత్యేకించి బిఎల్వోలు, బిఎల్ఓ సూపర్వైజర్లు, నియమించబడిన అధికారులు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలోనే ఉంటారని, వారికి సమాచారం అందించాలని చెప్పారు.ఎవరు ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగా నివాసం ఉన్నచోట ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, ఈ విషయం బిఎల్ఏల ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓటు హక్కు లేకుండా, అలాగే చనిపోయిన వారు, శాశ్వతంగా చిరునామా మారిన వారి వంటి వాటిని తీసి వేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడంలో భాగంగానే సర్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు.అర్హత ఉన్న ప్రతి ఓటరు జాబితాలో ఉండాలని , అదేవిధంగా అనర్హులు జాబితాలోకి రాకూడదని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు చల్లమల్ల నరసింహ, చకిలం రాజేశ్వరరావు, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ, ఎం.స్టాలిన్, కోట గోపి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 24 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఎస్ఐఆర్ కార్యక్రమంలో రానున్న 30 రోజులలో ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని తిరిగి స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో టామ్ టామ్ నిర్వహించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి తమ వివరాలను సక్రమంగా అందించాలని కోరారు. అన్‌మ్యాప్డ్ ఓటర్లు నిర్దేశించిన 11 ధృవ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని తెలిపారు. జిల్లాలో గుర్తించిన ఎక్కువ శాతం అనామలీలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి తక్కువ సమయంలోనే దరఖాస్తుల పరిష్కారం చేయనున్నట్లు అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, బి. జసవంత్, లింగనబోయిన సతీష్ బాబు, మంకన రమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నర్సింహారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు ఎస్. నవీన్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మందుల సామెల్



**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 24 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారులో గల ఇండిస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం 10 మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు చెక్ లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏమ్మెల్యే సామెల్ మాట్లడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్పష్టం చేశారు. డి.రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. అయితే, దశాబ్దాలుగా వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితిని వివరించడానికి తాను స్వయంగా జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యానని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, నిర్ణయించిన రూ. 6 లక్షలకు తోడుగా మరో రూ. 6 లక్షలు కలిపి అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, అలాగే ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కుర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్‌కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఎ. శేషగిరి రావు, డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నగేష్ కుమార్, జిపిఓ మాదవి పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీరేణుక ఎల్లమ్మ

**కనగల్లు, జూన్ 24 (జనం సాక్షి) :** ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి 24వ వార్షిక బ్రహ్మోత్సవాలలో (జాతర) భాగంగా బుధవారం తెల్లవారుజాముననే మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ లలిత సహస్రమార్చన బాల భోగ నివేదన కార్యక్రమాలను అర్చకులు నిర్వహించి అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షి ల ను పల్లకిలో మేల వాయిద్యాలు డబ్బు చప్పుల తో కళ్యాణ మండపం వద్ద కు తోడుకొని దేవతామూర్తులను కళ్యాణానికి సిద్ధం చేయగా రాష్ట్ర రోడ్లు , భవనముల ఒ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కళ్యాణ మహోత్సవానికి హాజరై మొదటగా ఆలయంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహి ఆలయం నుంచి పట్టు వస్త్రాలను మంత్రి స్వయంగా మోసుకొని మండపము లోకి రాగానేఆలయ పాలక మండలి, అధికారులు ఆహ్వానించగా కళ్యాణములు పాల్గొని పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఎల్లమ్మ-జమదగ్ని మహర్షి కళ్యాణాన్ని దేరం భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణ్ కుమార్ చార్యులు, గాదె ఉమామహేశ్వరరావు, దామోదర్ రావు లు సాంప్రదాయ రీతిలో వేదమంత్రోచనాల నడుమ దేవతామూర్తుల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగాజరుపగా భక్తులు ఆనందంగా తిలకించారు. అనంతరం తలంబ్రాల బియ్యం, కట్నాలు, కానుకలు సమర్పించుకొని తమ ముక్కులను తీర్చుకున్నారు. కళ్యాణం జరుగుతున్న సమయంలో కోలాటాల బృందాల ఆటపాటలను చూసి భక్తులు ఎంతో ఆనందపడ్డారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. చండూర్ సిఐ టి రాము పర్యవేక్షణలో ఆలయ వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు.

### ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి

ధర్వేశిపురం శ్రీ ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకక్షించారు. ధర్వేశిపురం ఆలయ అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన వెచ్చించి రాష్ట్రంలోనే ఆలయాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం 25 కోట్ల రూపాయలను కేటాయించినట్టు గుర్తు చేశారు. ఆలయము వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు ఉండేలా పాలకమండలితోపాటు అధికారులు సమన్వయంగా పనిచేసే ఆలయ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ కే భాస్కర్ ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి తహసిల్దార్ బి పద్మ, ఎంపీడీవో ఏ వేద రక్షిత, ధర్వేశిపురం సర్పంచ్ రాయల శేఖర్ పర్వతగిరి సర్పంచ్ నేలగంద రాసి



ముత్తయ్య, ఆర్ఐ సునీత, మాజీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, ఆత్మ చైర్మన్ గోలి జగాల్ రెడ్డి, ఎస్ఐ కె రాజీవ్ రెడ్డి, సంజీవరెడ్డి, శివకుమార్, ధర్మకర్తలు కే శంకర్ రెడ్డి, ఎం గణేష్ మోహన్, పి. సత్యనారాయణ, కే శ్రీను, ఎం రమణ, ఎన్ యాదగిరి, జి సైదులు, ఎన్ తిరుపతయ్య, మహేష్, సిహెచ్ రమేష్, ఎన్ వెంకటేశ్వర్లు, వెంకన్న పరమేష్ఆలయ సిబ్బంది కే నాగేశ్వరరావు, కే ఉపేందర్ రెడ్డి, రాజయ్య, సిహెచ్ శ్రీకర్, వెంకటయ్య, రాజు,, వివిధ గ్రామాల నుంచి మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు, పరిసర గ్రామాల నుంచి కుటుంబ సమేతంగా వేలాది సంఖ్యలుభక్తులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మధిర, జూన్ 24 (జనంసాక్షి) :** మధిర నియోజకవర్గ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివృద్ధి పనుల జాతరను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి, సుమారు రూ. 17.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు కీలక రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. మండలంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభమైన పనుల వివరాలు ఇలా ఉన్నాయి : చిరునోముల - వత్సవాయి రహదారి: రూ. 3.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ రహదారి పనులకు ఉప ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు.ముష్టికుంట్ల - గార్లపాడు రోడ్డు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రూ. 5.50 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించనున్నారు దళితవాడల అభివృద్ధిలో భాగంగా ముష్టికుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 73 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ముష్టికుంట్ల పరిధిలోని బోనకల్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి చిరునోముల వరకు రూ. 3.30 కోట్ల అంచనా వ్యయంతో నూతన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ముష్టికుంట్ల నుంచి నాగులవంచ మీదుగా చొప్పకట్లపాలెం వరకు రూ. 4.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు డిప్యూటీ సీఎం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చెప్పారు. అందులో భాగంగానే నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం రాకతో బోనకల్ మండలంలో పండుగ వాతావరణం నెలకొంది.

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 24 (జనం సాక్షి) :** జిల్లాలో రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా అంజనాపురంలో నిర్మాణంలో ఉన్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణం, మౌళిక వసతులు, నిర్మాణ పనులు, యంత్రాల ఏర్పాట్లపై సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, ఎండల తీవ్రత వంటి సవాళ్లను తట్టుకుని నిలబడగలిగే పంటల్లో ఆయిల్ పామ్ ముఖ్యమైందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ తోటలలో ప్రారంభ మూడు సంవత్సరాల వరకు మిర్చి, మొక్కజొన్న, వరి వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ జిల్లాలో వ్యవసాయ ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి నాంది పలుకుతుందని, జిల్లా రైతాంగానికి ఉపాధి, ఆదాయ వృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా జిల్లా పరిపాలన తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కొణిజర్ల తహసీల్దార్ అరుణ, ప్రాజెక్ట్ డీజీఎం, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ పొందిన బీఎల్ఓలకు సర్వే నిర్వహణకు అవసరమైన కిట్లు, ఇతర సామగ్రిని బుధవారం జిల్లా కలెక్టర్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ సర్వే నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు.ఓటరు జాబితా శుద్ధీకరణలో భాగంగా చేపడుతున్న ఈ సర్వేలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని కోరారు.బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు పూర్తి సహకారం అందించి, అవసరమైన వివరాలు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, సి సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ సిగ్నల్స్ సీసీ కెమెరాల ఏర్పాటు

- ప్రజలు వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి
- ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ అనుక్షణం కృషి
- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు అడ్డుకట్టు

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి) :** ప్రజల రక్షణ, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా సూర్యాపేట పట్టణంలో అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్స్, ఆటోమేటిక్ సీసీ టీవీ నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా పోలీస్, మున్సిపల్ శాఖల సమన్వయంతో బుధవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా, ఖమ్మం క్రాస్‌రోడ్ కూడళ్లలో అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థతో పాటు కీలకమైన 9 కూడళ్లలో 20 ఆటోమేటిక్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గడమే కాకుండా సులభమైన ప్రయాణం సాధ్యమవుతుందని అన్నారు.పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాస్త్రీయ విధానంలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించామని తెలిపారు. కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు సామర్థ్యంతో పనిచేస్తాయని, ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను సులభంగా గుర్తించవచ్చన్నారు. కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు.జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ప్రజల అవసరాలు, ప్రజా భద్రత దృష్ట్యా మొదటి విడతలో బస్టాండ్ జంక్షన్, ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద ఈ వ్యవస్థను ప్రారంభించామని చెప్పారు. ముఖ్యమైన 9 కూడళ్లలో ఏర్పాటు చేసిన 20 సీసీటీవీలు ట్రాఫిక్ ఉల్లంఘనలను ఆటోమేటిక్‌గా గుర్తించి ఈ-చలానా విధించేలా పనిచేస్తాయని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ వంటి ఉల్లంఘనలపై నేరుగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కెమెరాలు ట్రాఫిక్ నియంత్రణతో పాటు దొంగతనాలు, రౌడీషీటర్ల కదలికలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కూడా



ఉపయోగపడతాయని తెలిపారు.ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తోందని తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో సూర్యాపేటను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని, నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ శ్రీవిద్య జ్యోతి కరుణాకర్, సీఐ వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, మున్సిపల్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## పోస్టాఫీసుల్లో పేపర్ వర్క్‌లేకుండానే

# ఇక డిపాజిట్, విత్‌డ్రా

**న్యూఢిల్లీ:**పోస్టాఫీసుల్లో నగదు డిపాజిట్, విత్‌డ్రా నిబంధనలను తపాలా శాఖ సులభతరం చేసింది. ఆధార్ ఇ-కేవైసీ ద్వారా ఇకపై చిన్నమొత్తాల్లో లావాదేవీలకు పేపర్ వర్క్‌ను తప్పించింది. ఆధార్ బయోమెట్రిక్ ద్వారానే లావాదేవీలు నిర్వహించుకునే సదుపాయాన్ని తీసుకొచ్చింది. రూ.50 వేల వరకు డిపాజిట్లు, రూ.20 వేల లోపు విత్‌డ్రాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. జూన్ 22 నుంచే ఈ విధానం తీసుకొచ్చినట్లు తపాలా శాఖ వెల్లడించింది. ఈ సౌకర్యం కేవలం సింగిల్ ఖాతాలకు మాత్రమే వర్తిస్తుంది. మైనర్ లేదా జాయింట్ ఖాతాలకు వర్తించదు.పోస్టాఫీస్ బ్రాంచుల్లో సుకన్య సమృద్ధి యోజన, ఆర్డీ, సేవింగ్స్ ఖాతాదారులు ఇకపై ఆధార్ బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా ఎటువంటి పే-ఇన్ స్లిప్ లేకుండా రూ.50,000 వరకు డిపాజిట్ చేయవచ్చు. అలాగే, ఎటువంటి విత్‌డ్రాయల్ స్లిప్ లేకుండా బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా రూ.20,000 వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, అంతకంటే ఎక్కువ లావాదేవీలు జరిపే కస్టమర్లు తప్పనిసరిగా పేపర్ ఆధారిత ప్రక్రియ పూర్తి చేయాల్సిందే.అలాగే, ఆధార్ అథెంటికేటెడ్ పూర్తి చేసుకున్న ఖాతాదారులు త్వరలో ఏ పోస్టాఫీసు బ్రాంచ్‌లోనైనా లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఆధార్ అనుసంధానం లేని ఖాతాల లావాదేవీలు కేవలం వారు ఖాతా తెరిచిన హోమ్ బ్రాంచ్‌లోనే సాగుతాయి. ఇ-కేవైసీ, బయోమెట్రిక్ ఆర్థిక లావాదేవీలకు మొబైల్ నంబర్ తప్పనిసరి. 2026 సెప్టెంబర్ 1 నుంచి ఆఖీఇంఓ యాప్ ద్వారా జరిగే లావాదేవీలకు మొబైల్ నంబర్ లింక్ ఉండాల్సిందే. మొబైల్ నంబర్ లింక్ చేయని ఖాతాలలో ఈ యాప్ ద్వారా ఎటువంటి లావాదేవీలను అనుమతించరు.

## 1 నుంచి న్యాక్ ప్యాకేజింగ్

**రూ.440 కోట్ల ఐపీఓ..**

ప్యాకేజింగ్ సొల్యూషన్స్ ప్రొవైడర్ న్యాక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ ఐపీఓ జులై 1న ప్రారంభం కానుంది. జులై 3న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా దాదాపు రూ.440 కోట్లను సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు విలువ రూ.161-170గా కంపెనీ నిర్ణయించింది. రూ.2,080 కోట్ల మార్కెట్ విలువతో కంపెనీ ఐపీఓకు వస్తోంది. ఒక రోజు ముందుగానే (జూన్ 30) యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది.ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.380 కోట్ల విలువైన షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.59.5 కోట్ల విలువైన షేర్లు విక్రయానికి రానున్నాయి. రెండూ కలిపి మొత్తం రూ.439.5 కోట్లను పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ సమీకరించనుంది. ఇన్వెస్టర్లు ఒక బిడ్‌కు కనీసం 88 షేర్లను (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే షేరు గరిష్ఠ ధర వద్ద రూ.14,960 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇష్యూలో సగభాగం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు.కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్లో జులై 8న లిస్టింగ్ కానున్నాయి. సిస్టమాటిక్స్ కార్పొరేట్ సర్వీసెస్, ఐడీబీఐ క్యాపిటల్, పాంటోమ్యాథ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ లీడ్ మేనేజర్లుగా ఉన్నారు.

# సెన్సెక్స్ 791 పాయింట్లు పైకి

**ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు..**

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, వడ్డీ రేట్ల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చన్న ఆర్‌బీఐ గవర్నర్ సంకేతాలు సూచీలకు కలిసొచ్చాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు మరింత పతనం కావడం, విదేశీ మదుపర్లు కొనుగోళ్ల వైపు ఉండడమూ పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కు దాటింది. మదుపర్ల సంపద దాదాపు రూ.2 లక్షల కోట్ల మేర పెరిగింది.

సెన్సెక్స్ ఉదయం 76,229.76 పాయింట్ల (క్రితం ముగింపు 76,200.68) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడేలో 77,190.37 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికు 790.54 పాయింట్ల లాభంతో 76,991.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 197.55 పాయింట్ల లాభంతో 24,021.65 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ట్రెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75 డాలర్లకు చేరగా.. ఔన్సు బంగారం ధర 4,060 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



**కారణాలు ఇవే..**

వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెక్ పెట్టారు. ప్రస్తుత దశలో వడ్డీ రేట్ల పెంపు గురించి మాట్లాడడం తొందరపాటే అవుతుందని పేర్కొన్నారు. ఓ ఆంగ్ల టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. చమురు ధరల ప్రభావం, ద్రవ్యోల్బణాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. వడ్డీ రేట్ల సవరణ ఉంటే ముందుగానే మార్కెట్‌ను అందుకు సిద్ధం చేస్తామని తెలిపారు.నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో దక్షిణ కొరియాకు చెందిన కోస్పి సూచీ 10 శాతం పతనం కావడం, ఇతర ప్రపంచ మార్కెట్‌లు కూడా అమ్మకాల ఒత్తిడి కారణంగా మన మార్కెట్‌లు నష్టాలు చవిచూశాయి. నేటి ట్రేడింగ్ సెషన్‌లో కోస్పి సూచీ తిరిగి పుంజుకోవడం, ఇతర మార్కెట్లూ రాణించడంతో మన మార్కెట్‌పై ఆ ప్రభావం పడింది.భారత్, అమెరికాల మధ్య చరిత్రాత్మక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందనే వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. దీనికితోడు ముడిచమురు ధరలు నాలుగు నెలల కనిష్ఠానికి చేరాయి. చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఊరట కల్పించే అంశం కావడంతో సూచీలు పరుగులు పెట్టాయి.గత కొన్ని రోజులుగా అమ్మకాల వైపు ఉంటున్న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఎ) వరుసగా మూడో సెషన్‌లోనూ కొనుగోళ్లు జరపడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీనికితోడు టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ, బ్యాంకింగ్ షేర్లు సూచీలకు అండగా నిలిచాయి.

## ఆ 'కోల్డ్ ఈమెయిల్'తోనే.. కునాల్ షా వాట్సప్ బాస్‌గా..!

ప్రపంచవ్యాప్తంగా అత్యధికమంది ఉపయోగించే మెసేజింగ్ యాప్ వాట్సప్‌నకు మనదేశానికి చెందిన కునాల్ షా సీఈఓగా నియమితులయ్యారు. ఈ నియామకం బిజినెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అలాగే ఆయన ఎంపిక కూడా భిన్నంగానే జరిగింది. ఒక చిన్న కోల్డ్ ఈమెయిల్ టెక్ ఇండస్ట్రీలో అతి కీలక నియామకానికి దారిచూపింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..వాట్సప్‌నకు మెటా మాతృ సంస్థ. మెసేజింగ్ యాప్‌నకు ప్రధాన మార్కెట్లుగా ఉన్న భారత్, బ్రెజిల్, మెక్సికో నుంచి కొత్త సీఈఓను ఎంచుకోవాలని మెటా భావించింది. దానిలో భాగంగా ఆ సంస్థ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్‌గా ఉన్న క్రిస్‌కాక్స్ కొత్తబాస్‌ను వెతికే ప్రయత్నాల్లో భాగంగా ఆ దేశాల్లో ఉన్న వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులతో మాట్లాడారు. పలువురికి కోల్డ్ మెయిల్స్ పంపారు. వాట్సప్ భవిష్యత్తు ఆలోచనలను సేకరించేందుకు, తదుపరి నాయకుడికి ఉండాల్సిన లక్షణాలను గుర్తించేందుకే ఈ ప్రయత్నం చేసినట్లు క్రిస్‌కాక్స్ వెల్లడించారు. అలా ఆయన మెయిల్ చేసిన వారిలో కునాల్ కూడా ఒకరు.

**5 ఏళ్లలో రూ.40,000 కోట్ల పెట్టుబడులు**

"కునాల్ ఆలోచనలు గొప్పగా ఉన్నాయి. వాటి గురించి మనం మాట్లాడుకుందామా అని అడిగాను. ఆ తర్వాత మూడు నెలల పాటు నియామక ప్రక్రియ జరిగింది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, ఇతర సీనియర్లతో సమావేశాలు జరిగాయి. వినియోగదారులు, డిజిటల్ వ్యాపారంపై ఆయనకున్న అవగాహన వాట్సప్ భవిష్యత్ వృద్ధికి ఉపయోగపడుతుందని నమ్మకం కుదిరింది" అని క్రిస్ వెల్లడించారు.

కోల్డ్ ఈమెయిల్ అంటే?: ఇంతకుముందు పరిచయం లేని వ్యక్తికి ప్రొఫెషనల్ డిస్కషన్ కోసం పంపే మెయిల్. ఆ వ్యక్తి ఒక ఇన్వెస్టర్ కావొచ్చు. బిజినెస్ పార్ట్‌నర్, క్లయింట్ కూడా అయ్యుండొచ్చు.క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపుల కోసం 2018లో క్రెడ్‌ను స్థాపించారు కునాల్ షా. దేశంలో జరుగుతున్న క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్లలో 40 శాతానికి పైగా క్రెడ్ వేదికగానే జరుగుతున్నాయి. ఫ్రీఛార్జ్ స్టార్టప్‌తో తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించిన కునాల్.. దేశంలోనే ప్రముఖ వ్యాపారవేత్తగా, ఏంజెల్ ఇన్వెస్టర్‌గా 250కిపైగా స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టారు. భారత్‌లో ఆయనకున్న అనుభవమే ఈ సీఈఓ పదవి దక్కడానికి కీలకమైంది వాట్సప్ తన పరిధిని దాటి విస్తరించాలని యోచిస్తోన్న తరుణంలో కునాల్‌లోని ఈ బిల్డర్ మెంటాలిటీనే తమను ఆకట్టుకుందని మెటా సీఈఓ మార్క్ జుకర్ బర్గ్ కొనియాడిన సంగతి తెలిసిందే.

## 300 నగరాలకు అమెజాన్ నౌ

క్విక్ కామర్స్ విభాగంలో పోటీ మరింత తీవ్రం కానుంది. ప్రస్తుతం ఈ విభాగంలో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో పోటీ పడుతుండగా.. ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కూడా ఈ మధ్యే రేసులోకి దిగింది. ప్రస్తుతం ప్రధాన నగరాలకే పరిమితమైన తన 'అమెజాన్ నౌ' క్విక్ కామర్స్ సేవలను మరింత విస్తరించనుంది. దేశంలోనే అతిపెద్ద క్విక్ కామర్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంతో 300 నగరాలకు అమెజాన్ నౌ సేవలను విస్తరించనున్నట్లు కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ ప్రకటించారు. భారత్ పర్యటనకు వచ్చిన ఆయన.. బుధవారం అమెజాన్ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విస్తరణ ప్రణాళికను ప్రకటించారు.ప్రస్తుతం అమెజాన్ నౌ సేవలు హైదరాబాద్, బెంగళూరు, దిల్లీ- ఎన్‌సీఆర్, ముంబయి, పుణె వంటి 15కు పైగా నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. దీనిని మరింత వేగంగా విస్తరించడానికి మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను అమెజాన్ భారీగా పెంచనుంది. 300 నగరాలకు ఈ సేవలను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. అమెజాన్ నౌ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని అమెజాన్ ఇండియా అధిపతి సమీర్ కుమార్ తెలిపారు. అమెజాన్ ఇండియా చరిత్రలోనే ఇది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిజినెస్ యూనిట్‌గా నిలిచిందన్నారు.మరోవైపు డెలివరీ భాగస్వాముల సంక్షేమం కోసం అమెజాన్ 'సమ్మాన్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. డెలివరీ ఏజెంట్ల పిల్లల విద్య కోసం స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# ఏఐ మోడళ్లపై కంపెనీల దృష్టి

- వీటి ఆదాయంలో ఏఐ వాటా రూ.30,400 కోట్లు
- ఉద్యోగులతో సమానంగా ఏఐ ఏజెంట్లకు టీసీఎస్ సన్నాహాలు
- సర్వమ్ ఏఐలో హెచ్‌సీఎల్ టెక్‌కు వాటా
- అధునాతన నైపుణ్యాలుంటేనే ఉద్యోగులకు మనుగడ





**న్యూఢిల్లీ:**ఐటీ కంపెనీలు త్రైమాసిక ఫలితాలు వెల్లడించేటప్పుడు ఎక్కువ మంది ముఖ్యంగా యువత గమనించేది 'ఎంత మంది ఫ్రెషర్లను తీసుకుంటారు' అనే. ఏఐ (కృత్రిమమేధ) అందుబాటులోకి వచ్చాక, గత ఆర్థిక సంవత్సరం నుంచి ఐటీ కంపెనీలు భారీ నియామకాలను పక్కనపెట్టాయి. అవసరమైతేనే.. అది కూడా నైపుణ్యమున్న వారినే నియమించుకుంటున్నాయి. మనదేశంలో గత ఆర్థిక సంవత్సరంలో, ఐటీ రంగంలో నికరంగా 2,000 నియామకాలే చోటు చేసుకున్నాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఏఐ మోడళ్లు, ఏజెంట్లు, ఆటోమేషన్ వైపు మొగ్గుచూపుతూ, లాభాదాయాలు పెంచుకోవాలని ఆదాయ వనరులను సృష్టించుకోవాలని భావిస్తున్నాయి. ఈ మార్పునకు కారణమేంటి?భారత ఐటీ కంపెనీలు ఇపుడు సరికొత్త దశలోకి చేరుకున్నాయి. నిన్నమొన్నటి వరకు బోర్డు రూముల్లో చర్చలకే పరిమితమైన కృత్రిమ మేధ(ఏఐ) కాస్తా ఇపుడు కార్పొరేట్ల లాభనష్టాల గణాంకాల్లో పొందిగ్గా కూర్చుంది. పవర్ పాయింట్ మార్కెటింగ్ స్లైడ్లను తయారు చేయడం నుంచి ఒక ఆదాయ వనరు సృష్టికర్తగా మారింది. అందుకు నిదర్శనమే హెచ్‌సీఎల్ టెక్ వంటి ఐటీ దిగ్గజం దేశీయ ఏఐ యూనికార్న్ అయిన సర్వమ్ ఏఐలో ఇటీవల 10.46% వాటా కొనుగోలు చేయడం. అందుకు 150 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.1427 కోట్లు వెచ్చించింది. ఈ ఒప్పందం భారత టాప్ ఐటీ కంపెనీల ధోరణి ఎలా మారుతుందో స్పష్టమైన సంకేతమిస్తోంది. పాశ్చాత్య దేశ కంపెనీలకు కేవలం కోడ్ రాయడానికి బదులుగా భారత ఐటీ సంస్థలు ఇపుడు ఫౌండేషనల్ మోడళ్లను నేరుగా కొనుగోలు చేసే వరకూ వెళ్లాయి.

వెల్లువెత్తుతున్న ఆదాయాల వల్లే..

కంపెనీలు ఇలా తమ ధోరణిని ఉన్నట్లుండి మార్చుకోవడానికి కారణం లేకపోలేదు. భారత్‌లోని అగ్రగామి మూడు ఐటీ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్.. కలిపి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,400 కోట్లు) వార్షిక ఏఐ ఆదాయాలను పొందాయి. అంతర్జాతీయ ఎంటర్‌ప్రైజ్ భాగస్వాముల నుంచి ఇవి దక్కించుకున్నాయి. ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి ఏఐ ఫ్రంటియర్ ల్యాబ్‌లకు తమ సేవలను కంపెనీలకు అందించడానికి సేవా సంస్థలు అవసరం. ఐటీ దిగ్గజాలకు తమ పొరుగు సేవల ఆదాయాన్ని రక్షించుకోవడానికి నేరుగా ఫౌండేషనల్ మోడళ్లను వాడుకోవడం అవసరం. ఐటీ కంపెనీలు తమ ధోరణి మార్చుకోవడానికి ఇదే కారణం.

ఏ కంపెనీకి ఎంతొస్తుందంటే..

టీసీఎస్: ఈ కంపెనీ వార్షిక ఏఐ సేవల ఆదాయం 2.3 బిలియన్ డాలర్లకు చేరుకుందని ఇటీవల కంపెనీ సీఈఓ కె. కృతివాసన్ వెల్లడించారు. డేటా ఇంజినీరింగ్, క్లౌడ్ రెడీనెస్, ఫౌండేషనల్ అనలిటిక్స్.. వంటి వాటినన్నింటినీ ఏఐ గొడుగు కిందకు ఈ సంస్థ తీసుకువచ్చింది.హెచ్‌సీఎల్ టెక్: ఈ కంపెనీ అడ్వాన్స్‌డ్ ఏఐ కింద 620 మిలియన్ డాలర్ల ఆదాయం పొందినట్లు చెబుతోంది. కేవలం సెమీకండక్టర్ ఇన్‌ఫరెన్సింగ్ డిజైన్, సిలికాన్ లెవెల్ ఇంజినీరింగ్, ప్రొప్రైటరీ ప్లాట్‌ఫారాలను మాత్రమే ఇందుకు లెక్కలోకి తీసుకోవడం విశేషం.ఇన్ఫోసిస్: త్రైమాసిక ఏఐ ఆదాయం 275 మిలియన్ డాలర్లుగా నమోదైందని తెలిపింది. మొత్తం వ్యాపార పరిమాణంలో 5.5 శాతం వరకు ఏఐ వాటా ఉందని తెలిపింది.

5 లక్షల మంది ఉద్యోగులు= ఏఐ టూల్స్?

ఉద్యోగులను ఏఐ టూల్స్‌తో భర్తీ చేయడం మొదలైపోయింది. టీసీఎస్‌లాంటి పెద్ద సంస్థే తన టాప్ టైర్-1 ఖాతాల్లో 85% వరకు ఏఐ టూల్స్‌నే వినియోగిస్తోంది. 5 లక్షల మంది మానవ సిబ్బందికి సమానమైన ఏఐ టూల్స్‌ను తీసుకురావాలని టీసీఎస్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఇటీవలి ఏజీఎమ్‌లో పేర్కొనడం చూస్తుంటే మార్పు ఏ స్థాయిలో ఉండబోతోందో అర్థమవుతోంది. ఇన్ఫోసిస్ 12,000 డిస్టింక్ట్ ఏఐ అసెట్స్, 150 చిన్న పాటి లాంగ్వేజ్ మోడల్స్, 200 వరకు రెడీ-టు-డెప్లాయ్ ఎంటర్‌ప్రైజ్ ఏజెంట్లను సిద్ధం చేసింది.

నియామకాలు తగ్గిపోయాయ్

ఒకప్పుడైతే ఉద్యోగుల నియామకాల విస్తరణకు, కంపెనీల ఆదాయ వృద్ధికి లంకె ఉండేది. అంటే కాంట్రాక్టులు పెరిగే కొద్దీ ఉద్యోగులను పెంచుకోవాల్సి వచ్చేది. తద్వారా ఆదాయమూ పెరిగేది. ఇపుడు సీన్ మారింది. 2025-26లో భారత ఐటీ రంగం నికరంగా 2,000 మందినే జత చేసుకుంది. ఏడాది వ్యవధిలో చాలా మార్పులు రావడం ఇందుకు కారణం. 2024-25లో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా కలిసి 12,718 మందిని నికరంగా నియమించుకోగా, 2025-26లో ఈ సంఖ్య 7,389 మాత్రమే. ఈ నేపథ్యంలో ఏఐ నైపుణ్యాలున్న వారికే ఐటీ కంపెనీలు ప్రాధాన్యమిస్తున్నాయి మినహా, సాధారణ కోడింగ్‌కు కాలం చెల్లినట్లు కనిపిస్తోందని ఐటీ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## జీతాలు ఇవ్వట్లేదు

**సింగపూర్ సంస్థలపై భారత కార్మికుల ఆరోపణలు**

తమకు జీతాలు ఇవ్వట్లేదని భారత్, బంగ్లాదేశ్‌కు చెందిన 400 మంది వలస కార్మికులు సింగపూర్ సంస్థలపై ఆరోపణలు చేశారు. దీంతో ఆ దేశంలోని మానవవనరుల శాఖ దర్యాప్తు ప్రారంభించింది. కేపీఏ ఇంజినీరింగ్, ఎస్‌కే ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న 100 మంది కార్మికులు తొలుత ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ మొదలైంది. తర్వాత నుంచి బాధితుల సంఖ్య పెరుగుతూ వచ్చిందని, వారు వసతి ఏర్పాట్లపైనా ఫిర్యాదు చేశారని స్థానిక మీడియా వెల్లడించింది. దాంతో రెండు సంస్థల కార్యకలాపాలపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. బిజినెస్ రికార్డులను బట్టి.. ఈ రెండు సంస్థలు విదేశీ వ్యక్తుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఈ రెండు కంపెనీలకు ఒకే వ్యక్తి డైరెక్టర్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనకు ఎయిర్ కండీషనింగ్, ప్లంబింగ్, బిల్డింగ్ సర్వీసెస్ వంటి రంగాలకు చెందిన ఇతర సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. ఆయన గత ఏడాది ఒకేరోజు మూడు వేర్వేరు కంపెనీలను రిజిస్టర్ చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. జీతం రాకపోవడంతో ఈ కార్మికులకు ఆహారం కూడా అందడం లేదని, దాంతో తాము కనీస సదుపాయాలు కల్పిస్తున్నామని మైగ్రెంట్ వర్కర్స్ సెంటర్ వెల్లడించింది. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## 'సర్'లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వకపోవడమేంటి?

చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

## విద్యార్థులను ఉగ్రవాదులంటారా?

ఆరోపించారు.ఎక్స్‌లో స్పందించిన ఖర్గే, కేంద్ర ప్రభుత్వ హయాంలో అనేక పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. "90 పేపర్ లీక్‌లు జరిగాయి. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింది. నీట్ పేపర్ లీక్ ఘటనతో 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎన్నో కుటుంబాలు తీవ్ర వేదనను అనుభవిస్తున్నాయి. అయినా విద్యాశాఖ మంత్రి తన పదవిని అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా, విద్యార్థుల గొంతును ఉగ్రవాదుల గొంతుగా అభివర్ణిస్తున్నారు" అని ఖర్గే విమర్శించారు .ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడం బీజేపీ నేతలకు అలవాటైందని కూడా ఆయన ఆరోపించారు. గతంలో రైతుల ఉద్యమాల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులను ఆందోళన జీవులు, పరాన్న జీవులు అంటూ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఇప్పుడు విద్యార్థుల విషయంలోనూ అదే ధోరణి కొనసాగుతోందని అన్నారు. "విద్యార్థుల స్వరం దేశవ్యాప్తంగా మరింత బలంగా వినిపిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే" అంటూ ఖర్గే డిమాండ్ చేశారు.ఇదే అంశంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా మండిపడ్డారు. జంతర్‌మంతర్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనల సందర్భంగా విద్యాశాఖ మంత్రి వారిని ఉగ్రవాదుల బీ-టీమ్?గా అభివర్ణించారని ఆరోపించారు.

# చమురు కంపెనీల లాభదాయకత పైకి!

**పశ్చిమసియా యుద్ధానికి ముందు స్థాయి కంటే ఎక్కువ..**
**జేపీ మోర్గాన్ నివేదిక**

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతు న్నందున, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీ) లాభదాయకత మెరుగుపడ నుందని జేపీ మోర్గాన్ నివేదిక వెల్లడించింది. ముడిచమురును శుద్ధి చేసి, పెట్రోల్, డీజిల్‌గా మార్చి, విక్రయించే సంస్థలకు లభించే మార్జిన్లు.. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు స్థాయిలను అధిగమిస్తున్నట్లు వివరించింది. కేంద్ర ఎక్సైజ్ సుంకాలు తగ్గడమూ వీటికి కలిసి రానుంది. అయితే రుణమొత్తాలు పెరగడం, ఇంధన పన్నులపై అనిశ్చితి ఈ రంగం దీర్ఘకాలిక ఆదాయ వృద్ధికి పరిమితులు ఏర్పరచ వచ్చని పేర్కొంది. నివేదిక ప్రకారం..పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల అం తర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా, దేశీయంగా పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలు పెద్దగా సవరించలేదు. మే నెలలో పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధర లీటరుకు రూ.7.50 చొ ప్పున పెరిగినా, అప్పటి వాస్తవ వ్యయం కంటే త‌క్కువగానే ఉన్నాయి. ఇప్పుడు బ్యారెల్ ముడిచ మురు ధర 80 డాలర్ల సమీపానికి దిగిరావడం తో, ఓఎంసీల లాభదాయకత యుద్ధం ముందు స్థాయిల కంటే అధికమవుతోంది. వంటగ్యాస్ (ఎల్‌పీజీ)పై కంపెనీలకు నష్టాలు ఇప్పటికీ అధి కంగానే ఉన్నాయి. త్వరలోనే అవీ తగ్గుతాయి. ప్ర స్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రై మాసికమైన ఏప్రిల్-జూన్‌లో చమురు మార్కె టింగ్ కంపెనీల ఆదాయాలు దెబ్బతినే అవకాశం ఉన్నా, రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో లాభదాయకత మెరుగ్గా ఉంటుంది. చమురు ధరలు తగ్గితే, డిసెంబరు, మార్చి త్రైమాసికాల్లో ఓఎంసీల గణాంకాలు బాగుండే వీలుంది.ఈ అంశాల ప్రభావం: ఓఎంసీల మార్జిన్ల మెరుగుదలను రెండు అంశాలు పరిమితం చేస్తున్నాయి. గత కొన్ని నెలల్లో ఓఎంసీలు భారీగా రుణాలు తీసుకున్నాయి. వీటికి వడ్డీ చెల్లింపులు ప్రభావం చూపుతాయి. అయితే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం సంస్థలను ఆదుకుంది. మరి కొంతకాలం సుంకాలను తక్కువగా ఉంచడం ద్వారా, ఓఎంసీలను ఆదుకుంటుందని భావిస్తున్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు, ఇరాన్ యుద్ధానికి ముందు స్థాయికి తగ్గి, స్థిరపడ్డాక.. ఈ సుంకాలను మళ్లీ పెంచే అవకాశం ఉంది. చమురు ధరలు తగ్గుతూనే ఉంటే,



మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన బీపీసీఎల్, ఐఓసీ, హెచ్‌పీసీఎల్‌లలో అత్యధిక ప్రయోజనం బీపీసీఎల్, ఐఓసీలకు లభిస్తుందని సమాచారం.



## జూలై 2న ఉప్పల్ భగాయత్ భూ పోరాటం

### విజయవంతానికి తెలంగాణ రక్షణ సేన

**కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూలై 2న హైదరాబాద్ ఉప్పల్ బాగాయత్‌లో నిర్వహించనున్న భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బోగే పద్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో వేలాది మంది ఉద్యమకారులు కేసులు, లాఠీ దెబ్బలు, ఆర్థిక నష్టాలు భరించి, కొందరు ప్రాణత్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు తగిన గుర్తింపు, సంక్షేమం అందుతాయని ఆశించినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల సమయంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు, పెన్షన్, క్రియాశీల ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం వంటి హామీలు ఇచ్చినా వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం భూ పోరాటం చేపట్టడం జరిగిందన్నారు. జూలై 2న ఉప్పల్ బాగాయత్‌లో జరిగే మహా భూ పోరాటానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు, ఉద్యమ సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల సురేష్, జంగ అపర్ణ, గర్షకుర్తి విద్యాసాగర్, రంగరవేణి లక్ష్మణ్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు పోతు కనుకయ్య, బుస్స రవీందర్, అనంతగిరి సంపత్, అవుదుర్తి కళావతి, బోగే రాజేశ్వరి, దేవ అనసూర్య, చామణపల్లి చంద్రశేఖర్, నాగవెల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.


## పాఠశాలలో నర్సరీ చిన్నారి అనుమానాస్పద మృతి



**ముస్తాబాద్, జూన్ 24 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ చదువుతున్న నాలుగేళ్ల చిన్నారి ఈజ మెహరిన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితులను పరిశీలించి, వివరాలు సేకరిస్తున్నారు. చిన్నారి మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే చిన్నారి ఎలా మృతి చెందింది ఘటన పాఠశాల ప్రాంగణంలోనే జరిగిందా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. చిన్నారి కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యం వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, చిన్నారి మృతి జరిగిన పరిస్థితులు అధికారుల అధికారిక ప్రకటనలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది. పాఠశాల ముందు చిన్నారు మృతి దేహాన్ని పాఠశాల ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

### బీఎల్‌పలకు రాజకీయ పార్టీలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి : రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి);** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు,రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు,సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 25 వ తేదీ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 549 పోలింగ్ కేంద్రాలు ఉండగా,55 మంది బీఎల్ఓ సూపర్ వైజర్లు,549 మంది బీఎల్ ఓ లు ఉన్నారని వెల్లడించారు. జిల్లాలో 4,75,694 మంది ఓటర్లు ఉండగా, 2,28,579 మంది పురుషులు, 2,47,072 మహిళలు, 43 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారని వెల్లడించారు. వీరిలో 4,04,414 మంది మ్యాపింగ్ పూర్తి అయిందని,ఇంకా 71,280 మంది ఇంకా మ్యాపింగ్ చేయాల్సి ఉందని తెలిపారు. ఓటర్ జాబితాలో ఉన్న ఓటర్ల అందరికీ బీఎల్ఓలు ఈ నెల 25 వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇంటింటికీ వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తారని పేర్కొన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని,అలాగే ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తప్పనిసరిగా జూలై 31వ తేదీలోగా అందజేసి,రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బీఎల్‌వో ఎవరో ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారాలు నింపడంలో సహాయం అందించాలని ఆదేశించారు. ఫారాలతో పాటు ఎలాంటి గుర్తింపు కార్డుల జిరాక్స్ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని,గుర్తింపు కార్డు వివరాలు బీ ఎల్ ఓ లకు ఇవ్వాలని సూచించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ 31వ తేదీ జూలై రోజున పబ్లిష్ అవుతుందని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సరిగా కాకపోతే ఎన్నికల అధికారులు సంబంధిత వారికి నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఆ సమయంలో భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం పుట్టిన సంవత్సరాన్ని ఆధారంగా తీసుకుని అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు,క్లెయిమ్‌లను పరిష్కరించి,అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1, 2026ను ప్రమాణిక తేదీగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇల్లు తాళం వేసి ఉంటే బీఎల్‌వోలు మూడు సార్లు సందర్శిస్తారని చెప్పారు. ఓటర్లు (ఓటర్.ఈసీఐ.జీఓవీ.ఇన్) వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూరించవచ్చని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఫారం-6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్‌ఏలను నియమించి,వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని పేర్కొన్నారు.



## యూరియా యాప్ ద్వారా రైతుల కష్టాలు

### యూరియాయాప్‌లో పెట్టిన రెండు నిమిషాలకు 2250 బ్యాగులు బుకింగ్

**గంభీరావుపేట జూన్ 24 (జనంసాక్షి):** గంభీరావుపేట మండలంలో యూరియా కొరకు రైతులు యాప్ ద్వారా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మండలంలో యూరియా పంపిణీ చేసేందుకు ఫెర్టిలైజర్ యాప్ ను వ్యవసాయ శాఖ తీసుకువచ్చింది ఈ యాప్ లో పంపిన కొరకు ఫెర్టిలైజర్ సొసైటీలలో పంపిణీకి 2200 యూరియా బ్యాగులు యాప్ ద్వారా బుక్ చేసే క్రమంలో రెండు నిమిషాలకి 2200 బ్యాగులు బుక్ చేసుకోక కొంతమంది రైతులు సాంకేతిక లోపం వల్ల బుక్ కాకపోవడం తో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పాత పద్ధతినే యూరియా పంపిణీ చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

## అధికారుల తీరుపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అసహనం



**కరీంనగర్ టౌన్, జూన్ 24 ( జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో అధికారిక కార్యక్రమం సందర్భంగా ప్రోటోకాల్ వివాదం చోటు చేసుకుంది. నూతన కలెక్టరేట్ ఆవరణలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హెలిప్యాడ్, ఉత్తర ద్వారం, మెయిన్ రోడ్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. సుడా నిధులతో చేపట్టిన ఈ పనుల ప్రారంభోత్సవానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్, అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే ఇటీవల నిర్వహిస్తున్న కొన్ని కార్యక్రమాలకు తనకు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి కార్యక్రమాలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని, ప్రోటోకాల్ నిబంధనలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం అభివృద్ధి పనుల పురోగతి, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల అభివృద్ధిపై అధికారులు సమీక్ష నిర్వహించారు.

## "జనంసాక్షి" కథనంతో కదిలిన విద్యుత్ అధికారులు



**మంథని (జనంసాక్షి) :** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. సింగిరెడ్డిపల్లె ప్రజల పాలిట శాపం..!, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో 11 కెవి విద్యుత్ వైర్ల తొలగింపు, షిఫ్టింగ్ కు రూ.18 లక్షలు చెల్లించిన సింగరేణి, ఏడాది గడిచిన పూర్తికాని పనులు మంత్రి మందలిచిన మారని అధికారుల పనితీరు..! అనే శీర్షికతో "జనంసాక్షి"లో గత నాలుగు రోజుల క్రితం ప్రచురితమైన కథనానికి మంథని డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. గత మూడు రోజులుగా యుద్ధ ప్రాతిపదికన సుమారు 60 నూతన విద్యుత్ స్తంభాలను వేయగా.. బుధవారం 11 కెవి విద్యుత్ లైన్ గుంజడం, పనులను పూర్తి చేయడంతో పాటు పాత లెవెన్ కె.వి విద్యుత్ లైన్ నుంచి సరఫరా నిలిపివేసి కొత్త లైన్ కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ మంథని డి. ఈ ప్రభాకర్, ఏడి వెంకటరమణ పర్యవేక్షణలో రామగిరి విద్యుత్ శాఖ ఏఈ మహేందర్ రెడ్డి దగ్గరుండి పనులను పూర్తి చేయించారు. ఈ పనులు పూర్తి కావడంతో.. ప్రమాదకరంగా మారిన పాత లైన్ నుంచి విద్యుత్ సరఫరా తొలగించడంతో వర్షాకాలం.. గాలివానకు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి, విద్యుత్ వైర్లు తెగిపడి, ప్రాణ నష్టం కలగకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అవగాహన సదస్సు




**కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో దుర్శెడ్ జిల్లా పరిషద్ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాల దుర్వినియోగంకు వ్యతిరేకంగా సీపీ ప్రతిజ్ఞ చేపించారు.

**అన్ని ప్రాంతాల్లో అవగాహన**

కరీంనగర్ లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఈ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపారు. భవిష్యత్తు తరాలైన యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు పోలీసు శాఖ నిరంతరం అవసరమైన చర్యలు చేపడుతుందని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, యాంటీ నార్కోటిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్, స్థానిక కార్పొరేటర్ రవీందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం కృషి

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 24 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి పాఠశాలను ప్రారంభించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు,విద్యుత్,ఫర్నిచర్, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టి, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకుంటున్నామని, నాణ్యమైన బోధనకు ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థుల ఆహారం,వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వేములవాడ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని,ఏటీసీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆధునిక, పోటీ ప్రపంచానికి తగిన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వేములవాడలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని విప్ కొనియాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కేవలం లాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆధునిక జ్ఞానంతో కూడిన విద్య అందించాలని,వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ రోశీడి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్ ,పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ తూము మధు, కౌన్సిలర్లు, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదు ప్రజావంచన పాలన

### బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**మంథని, ( జనంసాక్షి ) :** కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదు.. ప్రజావంచన పాలన అని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి, ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జి తాటిపర్తి జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్ లో మంథని మాజీ ఎమ్మెల్యే, మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు, సర్ పై బూత్ లెవెల్ ఏజెంట్స్ ల శిక్షణ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి , పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ,మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జి వీర్ల వెంకటేశ్వర్ రావులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించే సర్ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలని, దీనిపై పూర్తిగా ప్రజల్లో అవగాహన లేదన్నారు. కేవలం మార్పులు చేర్పులు మాత్రమే అనుకుంటున్నారని, కానీ జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యూమెటర్ ఇంటింటికి వస్తారని, ఈ క్రమంలో గతంలో ఓటు కల్గి ఉన్నప్పటికి కూడా ఫాం నిర్ధేసిత సమయంలో సమర్పిస్తేనే ఓటు నమోదు ప్రక్రియ ఆరంభం అవుతుందన్నారు. ఫాం నింపివ్వకుంటే ఓటు నమోదు తొలగించే అవకాశం ఉంటుందని, దీనిపై కార్యకర్తలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, ఈ క్రమంలో చేపట్టే జైత్రయాత్ర విజయడంకా మోగిస్తదో మంథని నియోజకవర్గానికి హారతి ఇవ్వడానికి వస్తామన్నారు.

## కోడెల మొక్కు సంస్కృతి రాజన్న సన్నిధిలో తప్ప ఎక్కడ లేదు

### పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 25 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న సన్నిధిలో భక్తుల కోడె మొక్కుబడుల సంస్కృతి దేశంలో మరెక్కడా లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారము తిప్పాపురం గోశాలలో కోడెల పంపిణీ నిర్వహించారు.


ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ మాట్లాడుతూ దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర గ్రౌండ్ లోని గోశాలలో 163 తిప్పాపురం గోశాలలో 603 కోడెలు ఉన్నాయన్నారు. జాతర గ్రౌండ్ లోని గోశాల కోడెలు స్వామివారి మొక్కు బడికి ఉంటాయని, తిప్పాపురం గోశాలలో పరిమితికి మించి ఉన్న 200 కోడెలను ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న జిల్లాలోని అర్హులైన రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. కోడెల పంపిణీ కోసం ఒక కమిటీని కూడా నియమించి పారదర్శకంగా వ్యవహరిస్తూ, రైతులకు పలు సూచనలు చేసిన అనంతరం ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేవస్థానం గోశాల నుండి తీసుకెళ్లిన కోడెలను రైతులు భద్రంగా చూసుకోవాలన్నారు. రైతులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం కమిటీ నిర్ణయం మేరకు అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని రైతులకు మాత్రమే కోడెల పంపిణీ జరుగుతుందని, వచ్చేసారి నుండి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతులకు కోడెల పంపిణీ చేయాలని విహెచ్పి సూచన మేరకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కోడెలను తీసుకెళ్లి రైతుల గ్రామాలకు వెళ్లి తనిఖీలు కూడా చేస్తారని, రైతులు కోడెలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చేర్మెన్ పుల్కం రాజు, వైస్ చేర్మెన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చేర్మెన్ రొండి రాజు, వైస్ చేర్మెన్ కనికరపు రాకేష్, ఆర్డివో కేఎస్బి కుమారి, ఆలయ ఈవో రమాదేవి, జిల్లా పశు సమర్థ శాఖ అధికారి రవీందర్ రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసిల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఆలయ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత నిజామాబాద్ మనందరి ధ్యేయం

### నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య

### జూన్ 22 నుంచి 26 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

### యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ పాయింట్ ప్రారంభం



**బోధన్, జూన్ 24 ( జనంసాక్షి ) :** మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక శాపమని , వాటి నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పిలుపునిచ్చారు. బోధన్ పట్టణం ఆచన్ పల్లిలోని ఇందూరు మోడల్ పాఠశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన జూన్ 22 నుండి జూన్ 26 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదకద్రవ్యాల నిర్మూలన సంబంధించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా పోలీస్ కమీషనర్ పి సాయి చైతన్య మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు , సమాజం , దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం దాదాపు 400 కోట్లు ఖర్చు చేస్తున్నది అని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు , ప్రజాప్రతినిధులు , స్వచ్ఛంద సంస్థలు , ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా , విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. లేదా డయల్ ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908కు సంప్రదించాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో నిజామాబాదు జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

సే నో టూ డ్రగ్స్ , సే ఎస్ టూ లైఫ్ అని పిలుపునిచ్చారు. యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తం అవసరం అని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. జిల్లాలో 60 శాతం ప్రమాదాలు ఇంటర్నల్ రోడ్లలో 40 శాతం ప్రమాదాలు జాతీయ రహదారిలో అవుతున్నాయన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారి సమాజంలో అవగాహన కల్పించాలని , డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పోలీస్ కమీషనర్ గారు పిలుపునిచ్చారు. జూన్ 22 నుంచి 26 వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పాఠశాలలు , కళాశాలలు , గ్రామాలు , పట్టణాల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'యాంటీ డ్రగ్ సోల్జర్' సెల్ఫీ పాయింటును ప్రారంభించి , యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.



## సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్‌లో అమృత యూనివర్సిటీకి 37వ స్థానం

**ఖైరతాబాద్, జూన్ 24 (జనం సాక్షి) :** అమృత వి శ్వ విద్యాలయం టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్(ది) సస్టైనబిలిటీ ఇంపాక్ట్ రేటింగ్స్-2026లో ప్రపంచ వ్యాప్తంగా 37వ ర్యాంకు సాధించిందని యూనివ ర్సిటీ వైస్ ఛాన్సలర్, డీన్ ప్రొ.డా.మనీషా వి.రమేష్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఛాన్సలర్ మాతా అమృతానం దమయి దేవి తోకలసి ఆమె మాట్లాడుతూ పరిశ్ర మ, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు (ఎస్. డీ.జీ-9) విభాగంలో భారతదేశంలో నంబర్-1 స్థా నాన్ని దక్కించుకుందని తెలిపారు. నాణ్యమైన వి ద్య, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన, స్వచ్ఛ మైన నీరు, పారిశుధ్యం, సరసమైన, స్వచ్ఛమైన ఇంధనం విభాగాల్లో ప్రపంచ టాప్-25లో నిలిచిం దని చెప్పారు. ఇండోనేషియాలోని జకార్తాలో జరి గిన గ్లోబల్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కాంగ్రెస్-26 లో ఈ ఫలితాలను ప్రకటించారని తెలిపారు.

## షో రద్దు సమాచారం ఇవ్వకపోవడం సేవా లోపమే
### బుక్‌మైషోకు కన్స్యూమర్ కోర్టు షాక్

**కూకట్‌పల్లి జూన్ 24(జనంసాక్షి) :** హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన నారాయణన్ కుట్టిగోపాలకృష్ణన్ 2025 జనవరి 1న లులు మాల్‌లోని సినీపోలిస్‌లో ప్రదర్శించాల్సిన 'ధూితీతీశీట' సినిమా టికెట్‌ను బుక్‌మైషో ద్వారా బుక్ చేసుకున్నారు. అయితే థియేటర్‌కు వెళ్లిన తర్వాత షో రద్దు చేసి మరో సినిమాను ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించారు. విచారణలో రీఫండ్ ఇచ్చామని బుక్‌మైషో వాదించినప్పటికీ, షో రద్దు విషయాన్ని వినియోగదారునికి తెలియజేయాల్సిన బాధ్యత ప్లాట్‌ఫామ్‌పైనే ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఇది సేవా లోపమని పేర్కొంటూ బాధితుడికి రూ.10 వేల పరిహారం, రూ.2 వేల న్యాయ ఖర్చులు చెల్లించాలని ఆదేశించింది. వినియోగదారులకు సందేశం: టికెట్ డబ్బు తిరిగి రావడమే కాకుండా, సమాచారం ఇవ్వకపోవడం వల్ల కలిగిన అసౌకర్యంపై కూడా వినియోగదారులు న్యాయం కోరే హక్కు ఉందని ఈ తీర్పు స్పష్టం చేసింది.

## జీర్ణాశయ శస్త్రచికిత్సలో 'యశోద' అత్యుత్తమ విధానం





**కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి):** జీర్ణాశయ శస్త్రచికిత్సలో 'యశోద' ఆస్పత్రి అత్యుత్తమ విధానాలు అనుసరిస్తోంది. జీర్ణాశయ (గ్యాస్ట్రోఇంటెస్టినల్) వ్యాధుల చికిత్సలో చోటుచేసుకుంటున్న ఆధునిక పురోగతుల పై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్లో సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, అడ్వాన్స్ లాపరోస్కోపిక్ రోబోటిక్ జీర్ణాశయ శస్త్రచికిత్స నిపుణులు డా. ప్రసాద్ బాబు, డాక్టర్ జయదేవ్ లు వారి కరీంనగర్ పర్యటనలో మాట్లాడుతూ... గత దశాబ్ద కాలంలో జీర్ణాశయ శస్త్రచికిత్స రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. గతంలో పెద్ద కోతలతో నిర్వహించే సంప్రదాయ శస్త్రచికిత్సలకు బదులుగా, ప్రస్తుతం లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జరీ వంటి అత్యాధునిక మినిమల్లి ఇన్వేసివ్ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, వీటి ద్వారా రోగులకు మరింత సురక్షితమైన, ఖచ్చితమైన, వేగవంతమైన చికిత్స అందుతోందని పేర్కొన్నారు. "ఆధునిక జీర్ణాశయ శస్త్రచికిత్స లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాదు. రోగికి అత్యుత్తమ ఫలితాలు, అధిక భద్రత, త్వరితగతిన కోలుకునే అవకాశం, మెరుగైన జీవన నాణ్యతను అందించడం మా ప్రధాన ఉద్దేశ్యం'' అని డా. ప్రసాద్ బాబు, డా. జయదేవ్ తెలిపారు. రోబోటిక్ శస్త్రచికిత్స ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ సాంకేతికత ద్వారా త్రిమితీయ హై డెఫినిషన్ దృశ్యాలు, అత్యంత సూక్ష్మ కదలికల నియంత్రణ, చేతుల వణుకును తగ్గించే సదుపాయం, అత్యున్నత ఖచ్చితత్వం లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పెల్విస్, కాలేయం, క్లోమగ్రంధి ఎగువ జీర్ణాశయ ప్రాంతాల్లో నిర్వహించే సంక్లిష్ట శస్త్రచికిత్సలకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికత, మల్టీడిసిప్లినరీ వైద్య సేవలు సమయానుకూల చికిత్సల సమన్వయంతో రోగుల ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని డా. ప్రసాద్ బాబు సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ డాక్టర్ల బృందం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్లు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల వసూళ్ల కోసమే..
# నిబంధనలు దాటి అర్బన్ విధులు!

- హైలీ మ్యానిప్యులేటెడ్ పర్సన్.. జీవోలు, ట్రెజరీ రూల్స్ తుంగలో
- రాష్ట్రంలోనే వింత ప్రయోగం.. నిబంధనలు దాటి అర్బన్ పోస్టింగ్
- శాఖ అనుమతి లేని వివరణ... విద్యాశాఖలో హాట్ టాపిక్‌గా రిజండర్

**మహబూబ్ నగర్ బ్యూరో జూన్ 24 (జనంసాక్షి):**

ప్రభుత్వ నిబంధనలు, పరిపాలనా సూత్రాలను తుంగలో తొక్కుతూ, వ్యవస్థలను తన అభీష్టానికి అనుగుణంగా తిప్పుకోగల 'హైలీ మ్యానిప్యులేటెడ్ పర్సన్' వ్యవహారం ఇప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో దావాగ్నిలా రాజుకుంది. 'జనం సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనంతో ఈ అక్రమాల పుట్ట పగిలింది. రూరల్‌లో జీతం తీసుకుంటూ, అర్బన్‌లో తిష్టవేసిన సదరు పంచాయతీ రాజ్ ఉద్యోగి వెనుక ఉన్న ఆ 'అదృశ్య హస్తం' ఎవరిదనే చర్చ జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది.సదరు అధికారి ఉద్యోగం లో చేరినప్పటి నుంచి ప్రయివేట్,కార్పోరేట్ పాఠశాలకు క్షణాల్లో అనుమతులు వస్తున్నాయి అని జిల్లా విద్యాశాఖ లోనే తీవ్రమైన చర్చ సాగుతుండటం విస్మయానికి గురిచేస్తుంది.






**సొంతంగా పోస్ట్ క్రియేషన్..**

2024లో చిన్నచింతకుంట నుంచి మహబూబ్‌నగర్ రూరల్‌కు బదిలీపై వచ్చిన సదరు ఉద్యోగి, అక్కడ కేవలం నాలుగు నెలలు మాత్రమే పనిచేశారు. ఆ తర్వాతే అసలు నైపుణ్యాన్ని బయట పెట్టాడు.రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా, కేవలం మహబూబ్‌నగర్ అర్బన్ కోసం ఒక ప్రత్యేక 'యంఈఓ'పోస్టును సృష్టించుకున్నాడు.జిల్లా పరిషత్ విధులను గాలికి వదిలేసి, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి వచ్చే అక్రమ ఆదాయం కోసమే రూరల్ నుంచి అర్బన్‌కు ఈ 'కస్టమైజ్డ్' పోస్టింగ్ పొందారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రెండు సంవత్సరాలుగా ఈ అక్రమ తంతు సాగుతున్నా ఉన్నతాధికారులు మౌనం వహించడం వెనుక ఉన్నత ఆధికారులకు సైతం చేతులు తడుపుతున్నారనే చర్చ సాగుతుంది.

**'సచ్చిలుడి' రిజండర్**

సాధారణంగా పత్రికల్లో వచ్చే కథనాలపై వివరణ లేదా రిజండర్ ఇవ్వాల్సింది ఉన్నతాధికారులు. కానీ, ఈ 'మ్యానిప్యులేటర్' ఒక అడుగు ముందుకు వేసి, తనకు తానే 'సచ్చిలుడు' అన్నట్లుగా పత్రికకు రిజండర్ ఇవ్వడం విద్యాశాఖలో హాట్ టాపిక్‌గా మారింది. డిపార్ట్‌మెంట్‌కు కనీస సమాచారం లేకుండా, ఉన్నతాధికారి హోదాలో తానే స్వయంగా స్పందించడం ఆయన ఉద్దేశపూర్వక అతిక్రమణకు నిదర్శనమని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి.

**ఆర్జేడీ కార్యాలయమే కేంద్ర స్థానమా?**

ఈ అక్రమ పోస్టింగ్ వెనుక ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం కీలక పాత్ర పోషించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లా విద్యాశాఖను సైతం పక్కన పెట్టి, ఆర్జేడీ కార్యాలయం నుంచే ఫైళ్లు కదిలాయనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహబూబ్‌నగర్ అర్బన్‌కు మాత్రమే యంఈఓను నియమించడం వెనుక ఆంతర్యమేమిటో ఆర్జేడీ కార్యాలయమే సమాధానం చెప్పాల్సి ఉంది. మరోవైపు, తనను జిల్లా పరిషత్ విధుల నుంచి పూర్తిగా రిలీవ్ చేయాలంటూ సదరు ఉద్యోగి ఎంపీడీఓ కు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎంపీడీఓ కార్యాలయాన్ని వివరణ కోరగా, సదరు అధికారి వివరాలు చెప్పేందుకు అక్కడి సిబ్బంది జంకుతుండటం చూస్తే ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

**జిల్లా విద్యాశాఖ స్పందన**

ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా."యంఈఓ పోస్టులకు సంబంధించిన అంశాలు ఆర్జేడీ పరిధిలో ఉంటాయి. సదరు అధికారి వ్యవహారంపై వస్తున్న ఫిర్యాదులు, వాస్తవాలను ఉన్నతాధికారుల (ఆర్జేడీ) దృష్టికి తీసుకువెళ్తాం అని తెలిపారు. వ్యవస్థలను మ్యానిప్లేట్ చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## సైబరాబాద్ పరిధిలో ఆషాడం బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

**శేరిలింగంపల్లి, జోన్ 24 (జనంసాక్షి) :** వచ్చేనెల ఆశాఢమాసం బోనాలు ఉత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్ష సమావేశానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి హజారుద్దీన్, ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్ రెడ్డి, నవీన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ దయానంద్ తదితరులు హాజరు కావడం జరిగింది. ఇందులో ప్రధానంగా ఆషాడ మాసంలో నిర్వహించే బోనాలు ఉత్సవాలు ప్రభుత్వ ప్రతిష్టకు ప్రతిబింబంగా భావించాల్సి ఉంటుందని, ఉత్సవాల ఏర్పాట్లకు ఘనంగా కార్యక్రమాలు ఉండాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం తదితరులు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు తెలియజేశారు. ప్రధానంగా గజాల ఊరేగింపు, బోనాల ఉత్సవాల నిర్వహణ, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ రద్దీ నిర్వహణ, పారిశుద్ధ్య చర్యలు, అందుబాటులో రక్షిత మంచినీటి వసతి, ఇతర ప్రజా సౌకర్యాలు, అత్యవసర సేవల సౌలభ్యం వంటి అంశాలను కీలకంగా ప్రస్తావించినట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి భాగస్వామ్యం కలిగిన ప్రతి శాఖ చేపట్టాల్సిన బాధ్యతలు, ముందస్తు ఏర్పాట్లు, వివిధ శాఖల మధ్య పరస్పర సమన్వయం, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి విఘాతం కలగకుండా విస్తృత చర్యలు, ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాట్లు ఎలాంటి అలసత్వం ఉండకుండా ప్రత్యేక చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి ప్రభుత్వ పెద్దలు సిఎంసి అధికారులకు వివరించినట్లు తెలిసింది. బోనాల జాతరలో పరిశుభ్రమైన వాతావరణం, సమర్థవంతమైన పౌర సేవలు, భక్తులకు రక్షిత మంచినీరు, సురక్షితమైన సౌకర్యవంతమైన ఏర్పాట్లు కల్పించేందుకు సంబంధిత అన్ని శాఖలతో కలిసి తాము ఒక సమన్వయంతో ముందుకు సాగుతామని, బోనాల జాతర ఉత్సవాలను తప్పకుండా దిగ్విజయం చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతామని ఈ సందర్భంగా కమిషనర్ సృజన భరోసాను వ్యక్తం చేశారు.






## ఉప్పల్ బాగాయత్ అభివృద్ధికి రూ.38.85 కోట్ల వరం

### ఉప్పల్ బాగాయత్ రూపురేఖలు మార్చేలా భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం
### మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి కృషితో నిధుల మంజూరు

**ఉప్పల్, జూన్ 24 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలోని బాగాయత్ ప్రాంత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ, నిరంతర కృషి ఫలితంగా బాగాయత్ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.38.85 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఒకేసారి ఎనిమిది ప్రధాన అభివృద్ధి పనులు చేపట్టనుండటంతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు నీటి సమస్యలు, సరైన ఫుట్‌పాత్‌ల కొరత, యువతకు క్రీడా వసతుల లేమి వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాగాయత్ ప్రాంత ప్రజలకు ఈ నిధులు ఊరటనివ్వనున్నాయి. ముఖ్యంగా స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులు పూర్తయితే వర్షపు నీటి పారుదల వ్యవస్థ గణనీయంగా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పోరాటం చారిత్రాత్మకం

- పాలమూరు అధ్యయన వేదిక ప్రజాసంఘాల పోరాటం అజరామరం
- పాదయాత్రలు ఆందోళనలు, నిరసనలు, రిలేదీక్షలు, కరపత్రాలు సైతం గ్రామ గ్రామానికి పంపిణీ
- ఎట్టకేళ్ళకు భూ సేకరణకు గ్రీన్ సిగ్నల్

**ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి) :**

కొన్ని సంవత్సరాలుగా ఒక్కరూ ఇద్దరితో మొదలైన ఉద్యమం, పోరాటం, రంగారెడ్డి జిల్లా చౌదర్ గూడ మండలం నుండి షాద్ నగర్ ఆర్డిఓ, కార్యాలయం వరకు పాదయాత్రలు షాద్ నగర్ లో రిలే దీక్షలు నిరసనలు ఆందోళనలు చివరికి గ్రామ గ్రామానికి కరపత్రాల పంపిణీ ఎందుకంటే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తేనే ఈ ప్రాంత రైతాంగానికి సాగు త్రాగునీరు అందుతుందని పాలమూరు ఆధ్యయన వేదిక ప్రజాసంఘాల నాయకులు రాత్రింబవళ్లు కడుపు కాల్చుకొని ఉద్యమం మొదలుపెట్టారు హక్కులనేత ప్రొఫెసర్ హరగోపాల్, పాలమూరు ఆధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, ప్రొఫెసర్ కోదండరాం, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి లాంటి వారు ఈ ప్రాంతంలో పర్యటించి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాల్సిందే అంటూ పట్టు పట్టారు చౌదర్ గూడా మండలం నుండి షాద్ నగర్ ఆర్డిఓ కార్యాలయం వరకు పాదయాత్రలతో గ్రామ గ్రామాన పర్యటించి ప్రజల మద్దతు కూడగట్టారు అనంతరం రిలే దీక్షలు, నిరసనలు,ఆందోళనలు, గ్రామ గ్రామానికి కరపత్రాన్ని పంపిణీ చేసి ఈ ప్రాంత ప్రజలను రైతులను చైతన్యవంతం చేశారు సముద్ర మట్టానికి ఎత్తైన ప్రాంతం ఉండడంతో భవిష్యత్తులో నీటి కరువు ఏర్పడే దుస్థితి ఉందని గ్రహించిన మేధావులు ముందే సమస్యను పసిగట్టారు కచ్చితంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన చిట్టచివరి రిజర్వాయర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాల్సిందేనని రకరకాల నిరసనలకు



పిలుపునిచ్చారు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్, ప్రభుత్వాలను ప్రశ్నించారు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టకపోతే మీకు ఓట్లు అడిగే హక్కు లేదని గట్టిగా నిలదీశారు ఈ ఉద్యమం పోరాటం కొంతమేరకు ఫలించింది అనుకోవచ్చు.

కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కొరకై భూ సేకరణ కోసం నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమేనని చెబుతున్న పాలమూరు అధ్యయన వేదిక బృందం ప్రజాసంఘాల నాయకులు వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రక్రియ స్థలాన్ని గతంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ షాద్ నగర్ ఇంచార్జ్ గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో అప్పుడు టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, లాంటివారు పర్యటించి బహిరంగ సభలో ప్రసంగించారు ఆ బహిరంగ సభ అనంతరం పాలమూరు అధ్యయన వేదిక ప్రజాసంఘాల నాయకులు మాత్రం సిపిఎం, సీపీఐ , బీఎస్పీ, డీఎస్పీ,రాజకీయ పార్టీల మద్దతుతో తీవ్రంగా పోరాటం చేశారు.

## కరీంనగర్ జిల్లాను ప్రభుత్వ పథకాల అమలులో అగ్రభాగాన నిలపండి

### మానవీయ కోణంలో ప్రజల సమస్యలు పరిష్కరించండి
### జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసిన జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా

**కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో కరీంనగర్ జిల్లాను అగ్రభాగాన నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. బుధవారం రోజు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుండి నేరుగా కరీంనగర్ కలెక్టరేట్ కి చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజలకు సేవలు



అందించడం అధికారుల అదృష్టంగా బావించాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, జిల్లా యంత్రాంగం సమన్వయంతొ పని చేయాలని సమస్యల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు విజయవంతం చేయడమే కాకుండా, అధికారులు పథకాల సద్వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రా స్థాయి లో ప్రభుత్వ పథకాల అమలు పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

# అద్దెకు ఆర్టీసీ ఖాళీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు

**ముషీరాబాద్, జూనియర్ 24 (జనంసాక్షి) :** ఎప్పటికప్పుడు సరికొత్త ప్రయాణ అనుభూతులతో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ సరికొత్త వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కేవలం ప్రయాణికులను చేరవేయడమే కాకుండా, సంస్థ పరిధిలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ వ్యాపార సముదాయాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు సంస్థ సిద్ధమైంది. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి, తమ సంస్థలను విస్తరించుకోవాలనుకునే వారికి ఇది ఒక బంపర్ ఆఫర్‌గా నిలవనుంది.

**సారథ్య ఆలోచన.. సరికొత్త ఆదాయం**

సంస్థను లాభాల బాట పట్టించడంతో పాటు, స్థానిక నిరుద్యోగులకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నతాశయంతో టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. పారదర్శకమైన నిబంధనలు, లీజు పద్ధతుల ద్వారా ఈ స్థలాలను కేటాయించనున్నారు.

**ప్రజాక్షేత్రంలో వ్యాపార సామ్రాజ్యం**

సాధారణంగా ఏ వ్యాపారానికైనా 'కస్టమర్ల రాక' అనేది అత్యంత కీలకం. ఆర్టీసీ బస్టాండ్లు, కాంప్లెక్స్‌లు నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల, ప్రచార ఖర్చులు లేకుండానే వ్యాపారస్తులకు కస్టమర్లు లభిస్తారు. హోటళ్లు, ఫుడ్ కోర్టులు, సూపర్ మార్కెట్లు,

**వ్యాపార విస్తరణకు టీజీఎస్‌ఆర్టీసీ 'గోల్డెన్ ఛాన్స్'**
**టీజీఎస్ ఆర్టీసీతో చేతులు కలపండి, మీ వ్యాపారాన్ని పెంచుకోండి : ఎండీ వై.నాగిరెడ్డి**

బ్రాండెడ్ షోరూమ్‌ల నుండి చిన్న తరహా దుకాణాల వరకు అన్ని రకాల వ్యాపారాలకు ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్ లు అనువైన వేదికలుగా మారనున్నాయి.

**వ్యాపారులకు సువర్ణావకాశం**

తెలంగాణలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, డిపోల పరిధిలో ఉన్న ఈ ఖాళీ వ్యాపార సముదాయాల వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtc.telangana.gov.in లో పొందుపరచడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న 694 షాపులకు త్వరలో టెండర్లు పిలువబడుచున్నవి. టీజీఎస్‌ఆర్టీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అటు రవాణా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ, ఇటు వ్యాపార రంగానికి సరికొత్త ఊతాన్ని ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ సువర్ణావకాశాన్ని అందుపుచ్చుకుని వ్యాపారంలో రాణించాలని సంస్థ వర్గాలు కోరుతున్నాయి.



**దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ ఆన్లైన్లో వివరాలు**

ఆర్టీసీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, పారదర్శకతకు పెద్దపీట వేసేలా సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార సముదాయాల వివరాలను యాజమాన్యం అధికారిక వెబ్‌సైట్‌లో బహిరంగపరిచింది. ఏ ఏ ప్రాంతాల్లో ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి, అవి ఖాళీగా ఉన్నాయా లేక నిండిపోయాయా, ప్రస్తుతం ఆ షాప్ లను ఎవరు నిర్వహిస్తున్నారు, వారి లీజు కాలపరిమితి, అద్దె ఎంత అనే పూర్తి సమాచారాన్ని క్లియర్ కట్‌గా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పెడుతూ, వ్యాపార ప్రకటనలు, అద్దెదారుల ఎంపికలో డిజిటల్ జవాబుదారీతనాన్ని పెంచేందుకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయం ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. టీజీఎస్ ఆర్టీసీ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అటు రవాణా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తూ, ఇటు వ్యాపార రంగానికి సరికొత్త ఊతాన్ని ఇస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

**ఆర్టీసీతో చేతులు కలపండి, మీ వ్యాపారాన్ని పెంచుకోండి**

ఆర్టీసీ స్థలాల్లో షాప్స్ నిర్వహణ ప్రక్రియను మరింత సరళతరం చేశామని, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ అవకాశాన్ని వాడుకోవచ్చని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సూచించారు. టీజీఎస్ ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదావకాశం వ్యాపారులకు ఎంతో లాభదాయకమని, దీనిని సద్వినియోగం చేసుకుని వ్యాపార వృద్ధిని సాధించడమే కాకుండా సంస్థ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఎండీ వై.నాగిరెడ్డి కోరారు.

## లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు భూసేకరణ

- భూములను పరిశీలించిన పరిగి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు



**వికారాబాద్, జూన్ 24 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక ముందడుగు పడింది. ఈ పథకంలో భాగంగా నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సయ్యద్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భూములను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి భూసేకరణ, సర్వే ప్రక్రియ, ముంపు ప్రాంతాల గుర్తింపు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం దాదాపు 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు తేల్చారు. ఈ మేరకు భూసేకరణ పనులను వేగవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముమ్మరంగా కసరత్తు చేయనున్నారు. 2.80 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక భాగంగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ తెలంగాణలోని దాదాపు 4.97 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరు అందనుంది. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించనుంది.? రిజర్వాయర్ నిర్మాణంతో పరిగి, వికారాబాద్, తాండూరు రైతుల పొలాలు సస్యశ్యామలం అవుతాయని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం

- కిటికీ నుంచి శిశువు బయటరకు విసిరివేత
- యువతిని నీలోఫర్‌కు తరలించిన సిబ్బంది

**హైదరాబాద్, జూన్24 (జనంసాక్షి) :** గోల్కొండ ప్రాంతంలో ఉన్న ఓ విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ప్రసవం తీవ్ర కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి బాత్‌రూంలో ప్రసవించగా, అనంతరం నవజాత శిశువు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హాస్టల్‌లో నివసిస్తున్న యువతి అకస్మాత్తుగా బాత్‌రూంలో ప్రసవించింది. అనంతరం శిశువు మృతి చెందినట్లు గుర్తించారు. శిశువు వెంటిలేటర్ ప్రాంతం నుంచి కింద పడేయడంతో మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువు మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఘటనలో మరో ముఖ్యమైన అంశం యువతి గర్భవతి అనే విషయం హాస్టల్ సిబ్బందికి తెలియకపోవడం. హాస్టల్‌లోనే ఉంటున్న విద్యార్థిని గర్భవతి అయినప్పటికీ ఎవరూ గుర్తించలేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. దీనిపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. మరోవైపు, శిశువు మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. యువతి గర్భానికి, శిశువు మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా యువతి బావ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## పీకే శర్మ ఆత్మకథ 'ఫుట్‌ప్రింట్స్ ఆన్ ఫారెస్ట్' విడుదల




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ మాజీ ప్రధాన అటవీ సంరక్షణాధికారి (పిసిసిఎఫ్) పీకే శర్మ రచించిన ఆత్మకథ 'ఫుట్‌ప్రింట్స్ ఆన్ ఫారెస్ట్' మంగళవారం సాయంత్రం బేగంపేటలోని ఐఏఎస్ అధికారుల ఇన్‌స్టిట్యూట్‌లో అట్టహాసంగా విడుదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు దశాబ్దాలకు పైగా అటవీ సంరక్షణలో పని చేసిన అనుభవాలను రచయిత ఈ పుస్తకంలో విశదంగా పొందుపరిచారు. అరణ్యాలను కాపాడే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు ఈ కృతిలో జీవంగా ప్రతిబింబిస్తాయి. విడుదల కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు డాక్టర్ ప్రియదర్శి డాష్, భాలే రావు, ఏకే గోయల్, బీపీ ఆచార్య, రేమండ్ పీటర్, మధుకర్ రాజ్ సహా విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి పరేశ్ శర్మ పాల్గొని రచయిత కృషిని కొనియాడారు.



సర్వీసులో చేరే నవతరం అధికారులకు ఈ పుస్తకం మార్గదర్శకంగా నిలుస్తుందని వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. పుస్తకం ప్రస్తుతం అమెజాన్‌లో అందుబాటులో ఉంది.

## కస్టమర్‌లా వచ్చి కారుతో ఉడాయింపు

- నిజామాబాద్‌లో అనూహ్య ఘటన

**నిజామాబాద్, జూన్24 (జనంసాక్షి) :** కారు కిరాయకు మాట్లాడుకున్న వ్యక్తి డ్రైవర్ దిగి అరటి పళ్లు తెచ్చేలోగా రారుతో ఉడాయించాడు. ఈ ఘటన నిజామాబాద్‌లో జరిగింది. రోడ్డు పక్కన కారు ఆపి అరటి పళ్లు తెచ్చేలోపే కారు మాయమైన సంఘటన నిజామాబాద్ పట్టణంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. కుద్రిత్ బేగ్ అనే వ్యక్తి కారు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి లాగే కిరాయి కోసం పట్టణంలోని చెన్నై షాపింగ్ మాల్ వద్దనున్న అడ్డా వద్ద కారును నిలిపాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి నాందేడ్‌కు వెళ్లాలని కుద్రిత్ బేగ్ కారును రూ.4 వేలకు కిరాయికి కుదుర్చుకున్నాడు. కారు గాంధీ చౌక్ వద్దకు రాగానే సదరు కస్టమర్ అరటి పండ్లు తెమ్మని డ్రైవర్ కుద్రిత్ బేగ్‌ను కోరాడు. కారు పక్కకు ఆపి అరటి పండ్లు తీసుకుంటుండగా కిరాయి కుదుర్చుకున్న వ్యక్తి కారుతో పరారయ్యాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మారుమూలలకూ మెరుగైన వైద్య సేవలు చేరాలి


**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందేనని ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్లలో సౌకర్యాలు, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎదురవుతున్న సవాళ్లు మంత్రి సమీక్ష చేశారు. ఐటీడీఏ ప్రోగ్రామ్ ఆఫీసర్లతో గతంలో చేసిన రివ్యూలో తీసుకున్న నిర్ణయాల అమలుపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవింద్ర నాయక్, ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ప్రోగ్రామ్ ఆఫీసర్లు రాహుల్, మకరంద్, లెనిన్, ట్రైబల్ వెల్ఫేర్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్పిటళ్ల అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, తమకు ఎదురు అవుతున్న వివిధ రకాల చాలెంజెస్‌ను అధికారులు మంత్రికి వివరించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు, మాతా, శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, డయాలసిస్, క్యాన్సర్ స్క్రీనింగ్, సికిల్ సెల్ నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మందులు, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన వైద్య పరికరాలు ప్రతి హాస్పిటల్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. 108, 102 అంబులెన్స్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల గుండాల పీహెచ్‌సీలో జరిగిన మెటర్నల్ డెత్ ఘటన నుంచి ప్రతి అధికారి పాఠాలు నేర్చుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణలో ఉంచాలని, డెలివరీ డేట్ కంటే ముందుగానే, బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించాలని ఆదేశించారు. మాతా, శిశు సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న గిరిజన ప్రాంతాల ప్రజలకు చికిత్స మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం ఏజెన్సీ జిల్లాల్లో 25 డయాలసిస్ సెంటర్ల ద్వారా 1,373 మంది యాక్టివ్ రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా 170 మిషన్లతో మరో 34 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశామని మంత్రి గుర్తు చేశారు. అలాగే, ఎమర్జన్సీ డయాలసిస్ సేవల కోసం ఏజెన్సీ ప్రాంతాల్లోని 12 హాస్పిటళ్లలో అదనంగా 37 డయాలసిస్ మిషన్లను మంజూరు చేస్తున్నామన్నారు. కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు త్వరగా పూర్తయ్యేలా ఆరోగ్యశాఖతో పాటు, ఐటీడీఏ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గురుకులాలను సమీపంలోని హాస్పిటల్లకు ట్యాగ్ చేయాలని గతంలో మంత్రి సూచించగా, ఈ సమీక్షలో అధికారులు మంత్రికి మ్యాపింగ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గిరిజన, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను సమీప ప్రభుత్వ హాస్పిటళ్లతో అనుసంధానం చేసిన ప్రత్యేక మ్యాపింగ్‌ను మంత్రి సమీక్షించారు. దీనివల్ల అవసరమైన సందర్భంలో విద్యార్థులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. హాస్పిటల్ నుంచి 20 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న విద్యాసంస్థలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అత్యవసర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్, తలసీమియా, రక్తహీనత, క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. మొబైల్ యూనిట్ల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను విస్తరించడంతో పాటు క్యాన్సర్ నోటిఫికేషన్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లు, ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లలో వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, మందులు, డయాగ్నస్టిక్ సేవలు, రక్త నిల్వలు, ఇతర అంశాలపై మంత్రి ఐటీడీఏ వారీగా సమీక్ష నిర్వహించారు. ఖాళీల భర్తీ, మౌలిక వసతుల కల్పన, అవసరమైన యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి తీసుకురావడంపై వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజెంటేషన్లు, నివేదికలు మాత్రమే సరిపోవని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాలు, తండాలు, ఆశ్రమ పాఠశాలలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను నిరంతరం సందర్శిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


## రైతుబంధు విషయంలో మరోసారి దగా

- కుసుమ్ పథకంలో వేయికోట్ల మోసం
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి




**హైదరాబాద్, జూన్24 (జనంసాక్షి) :** రైతుబంధు విషయంలో మరోసారి మోసం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారంపై విరుచుకుపడ్డారు. వానా కాలం రైతుబంధు వేస్తామని కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. యాసంగి మీ తాత ఇస్తాడా? అంటూ చురకలు అంటించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన రైతు బంధును సక్కగా ఇచ్చినా కూడా రూ.30 వేల కోట్లు ఇంకా తెలంగాణ రైతులకి బాకీ ఉన్నావని విమర్శించారు. తెలంగాణ రైతులు రేవంత్ రెడ్డి మోసాలను గమనించాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సర్ కార్యక్రమం ముగిసిన తరువాత ఎన్నికలకు వెళ్లనున్న దృష్ట్యా వానాకాలం రైతు బంధు వేస్తామని నాటకాలాడుతున్నారని, వానాకాలం, యాసంగి కాలం ఇవ్వాల్సిన బాకీని ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బ్యాంకును కూడా బ్లాక్ మెయిల్ చేసే మొనగాడని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై ఆయన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలను పక్కనబెట్టేసిందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని విమర్శిస్తూ.. ముఖ్యంగా 'కుసుమ్' పథకంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని పేర్కొన్నారు. ఈ స్కామ్‌లో కొందరు పెద్దల పేర్లు వినపడుతున్నాయని, దీనిపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్షణమే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై స్పందిస్తూ.. పీసీసీ చీఫ్ పదవికి ఎసరు పెడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. మెట్రో ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనంటూ చేస్తున్న ప్రచారాన్ని జగదీష్ రెడ్డి తిప్పికొట్టారు. నిజానికి మెట్రో విషయంలో బీజేపీ , 'హైబ్రిడ్ కాంగ్రెస్' ఒక్కటయ్యాయనే విషయం స్పష్టంగా తేలిపోయిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీతో జట్టు కట్టారని విమర్శించారు. చంద్రబాబు, మోదీ ఆలోచనల నుండి పుట్టిన ఒక క్రాస్ బ్రీడ్, హైబ్రిడ్ సీఎం ప్రస్తుతం రాష్ట్ర పాలన సాగిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ, జాతీయ బ్యాంకులను భయపెడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయబట్టే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా ఇతర కేంద్ర మంత్రులతో రేవంత్‌కు సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని అన్నారు. దీన్ని బట్టి చూస్తే కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి పీఏ లాగా పని చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనలకు ప్రభుత్వం ఎందుకు అంతలా భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణలో పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేయడంపై జగదీష్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణలోనే కాదు, దేశంలో ఎక్కడైనా తమ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఇందులో కొత్తగా ఆఫీస్ పెట్టడం ఏముందని, ఆయన ఎప్పటి నుంచో ఇక్కడే ఉన్నారు కదా అని గుర్తుచేశారు. గతంలో తెలంగాణ వచ్చినందుకు నిరసనగా 11 రోజులు అన్నం తినకుండా పవన్ కళ్యాణ్ చేసిన దీక్ష కూడా తెలంగాణలోనే జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడి తిండితోనే వాళ్ల శరీరం నిర్మాణం అయిందని వ్యాఖ్యానించారు. చివరగా.. పవన్ కళ్యాణ్, మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. వీరందరూ ఒకే కూటమిగా, ఒక్కటిగానే పనిచేస్తున్నారని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్వల్పంగా దిగిన బంగారం ధరలు



**హైదరాబాద్, జూన్24 (జనంసాక్షి):** బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మెల్లగా దిగి వస్తున్నాయి. అమెరికా డాలర్ బలపడడం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది.గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,330గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,300గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,40,000గా ఉంది.

## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

- ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, జూన్24 (జనంసాక్షి) :** శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఈఓ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్ పాల్గొన్నారు.

## వర్షాకాలంలో పోలీసులకు ఆసరా

- రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన కమిషనర్



**రామగుండం, జూన్24 (జనంసాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్‌కోట్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విధి నిర్వహణ సమయం లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్,మల్లేశం,రమేష్ పాల్గొన్నారు.

## ఒంటరి దివ్యాంగురాలిపై అత్యాచారం

- దుండగుడి కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్, జూన్24 (జనంసాక్షి) :** నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నదివ్యాంగురాలిపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినికిడి శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా, నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370